www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శుక్రవారం 3 జనవరి 2025
సంపుటి :06 సంచిక : 216 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## మాజీ ఎమ్మెల్యే ప్రదీప్ నాయక్ అకాల మరణం తీరనిలోటు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**మహారాష్ట్ర వెలుతురు జనవరి 02:**
మహారాష్ట్ర లోని కిన్వట్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ప్రదీప్ నాయక్ అకాల మరణం తీరనిలోటని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే ప్రదీప్ నాయక్ అంత్యక్రియలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రదీప్ నాయక్ ఎమ్మెల్యేగా కిన్వట్ నియోజకవర్గానికి ఎన్నో సేవలందించారని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని పాయల్ శంకర్ గుర్తు చేసుకున్నారు.



## క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

- నలుగురికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలు
- డి.గుకేశ్, హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్, మను బాకర్‌ల ఎంపిక
- అర్జున అవార్డుకు 32మంది, ద్రోణాచార్య అవార్డుకు ఐదుగురి ఎంపిక
- అర్జున అవార్డుల్లో తెలుగమ్మాయిలు దీప్తి, యర్రాజీలకు చోటు

2 లో..

# 14నుంచే రైతుభరోసా పంపిణీ

- రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించే యోచన
- అసలుసిసలు సాగుదారులకే సాయం
- కేబినేట్ సబ్ కమిటీలో మరోమారు చర్చ



**హైదరాబాద్,జనవరి2( వెలుతురు):**
రైతు భరోసాపై చర్చించిన కేబినేట్ సబ్‌కమిటీ ఇక సాగురైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం గురువారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితి పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని



2 లో..

## దీప్తి జీవాంజీ కి అర్జున అవార్డు రావడం పట్ల సీఎం రేవంత్ హర్షం

- దేశం తరపున కాంస్య పతకాన్ని సాధించిన వరంగల్ బిడ్డ దీప్తి
- గతంలోనే సీఎం కోటి నగదు బహుమతి ఇచ్చిన సీఎం
- వరంగల్ లో 5 వందల గజాల స్థలం, గ్రూప్-2 లో ఉదోగ్యం

2 లో..



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 2:**
జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (TUWJ) 2025 మీడియా డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎస్. హరీష్, దేవులపల్లి అమర్, ఐజేయు మాజీ అధ్యక్షులు, కే.విరాహత్ అలీ, టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు, కె.రాంనారాయణ, టీయుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యదర్శి, ఐజేయు, కె.సత్యనారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు, ఐజేయు, కల్యాణ రాములు, ఉప ప్రధాన కార్యదర్శి, టీయుడబ్ల్యూజే, కె. శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి, టీయుడబ్ల్యూజే, యం. వెంకట్ రెడ్డి, కోశాధికారి, టీయుడబ్ల్యూజే, ఏ. రాజేష్, బి. కిరణ్, గౌస్ మోహియుద్దీన్, అనీల్, రాష్ట్ర

2 లో..

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి చోటా కాంగ్రెస్దే విజయం

- మంత్రి పొన్నం ప్రభాకర్




( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 2:**
హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండల కేంద్రంలో ముఖ్య నేతలు,కార్యకర్తలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లో ఉన్న సమస్యల పై ఆరా.పలు అంశాలపై వెంటనే అధికారులతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా

2 లో..

## కల్వకుంట్ల కుటుంబం జైలుకెళ్లక తప్పదు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు



**జనగాం,జనవరి2 వెలుతురు):**
మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై మాజీ మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన

2 లో..

## సిఎంఆర్ కాలేజీ హాస్టల్‌లో రహస్య చిత్రీకరణ

- విద్యార్థుల ఆందోళనపై మహిళా కమిషన్ స్పందన
- సుమోటాగా కేసు నమోదు... నివేదిక ఇవ్వాలని కమిషనర్‌కు ఆదేశం
- వార్డెన్‌ను తొలగించామన్న ప్రిన్సిపాల్

2 లో..



## ఎన్‌సీడీపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రివ్యూ
## పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై మంత్రి ఆరా

- ఇటీవలే ప్రతి జిల్లాలోనూ ఎన్‌సీడీ క్లినిక్స్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- క్లినిక్స్ పని తీరును మంత్రికి వివరించిన అధికారులు
- గ్రామాలు, మండలాల వారీగా పేషెంట్ల జాబితాను తయారు చేసి, హాస్పిటల్స్‌కు, ఎన్‌సీడీ క్లినిక్స్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించిన మంత్రి
- పేషెంట్లు మెడిసిన్ రెగ్యులర్‌గా వినియోగించేలా ఫాలోఅప్ చేయాలన్న మంత్రి



**హైదరాబాద్ వెలుతురు జనవరి 02:**
ప్రభుత్వ దవాఖాన్లలో ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ క్లినిక్‌లకు బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌లతో బాధపడుతున్న రోగులను అనుసంధానం చేయాలని అధికారులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లలో అందుతున్న వైద్య సేవలపై పేషెంట్లకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా పేషెంట్ల జాబితాను తయారు

2 లో..



## అన్నా వర్సిటీలో అత్యాచార ఘటనలో న్యాయ పోరాటం ఏదీ

- మీడియా దృష్టి ఆకర్శించేందుకు యత్నం
- రాజకీయ పార్టీల తీఉపై మండిపడ్డ హైకోర్టు

**చెన్నై,జనవరి2( వెలుతురు):**
అత్యాచార ఘటనలో న్యాయం చేయాలన్న డిమాండ్ పక్కకు పోయి, రాజకీయ పోరాటాలు తెరపైకి వస్తున్నాయి. ఇలాంటి సందర్భాలపై మద్రాస్

2 లో..

## అమరావతి నిర్మాణంలో మరింతవేగం

- త్వరగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ
- నిధులకు కేబినేట్ ఆమోదంతో తొలగనున్న అడ్డంకులు

2 లో..

**అమరావతి,జనవరి2( వెలుతురు):**
అమరావతి పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం వేగం పెంచింది. మూడేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామన్న సిఎం చంద్రబాబు ప్రకటన మేరకు క్షేత్రస్థాయిలో పనుల్లో కూడా వేగం పెరిగింది. వివిధ



## కోటిమంది టిడిపి కార్యకర్తలకు బీమా

- యునైటెడ్ ఇండియాతో టిడిపి ఒప్పందం



9 లో..

## పుస్తక పఠనంతో నిలబడే ధైర్యం వచ్చింది

- ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి
- విజయవాడలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన పవన్
- పివిపై రాసిన పుస్తకావిష్కరణ చేసిన డిప్యూటి సిఎం



**విజయవాడ,జనవరి2( వెలుతురు):**
తనకు జీవితంలో నిలబడే ధైర్యాన్నిచ్చింది పుస్తకాలేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన 35వ పుస్తక మహోత్సవాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు సాహితీ వేత్తగా,

9 లో..

(మొదటి పేజీ తరువాయి..)

# దీప్తి జీవాంజీ కి అర్జున అవార్డు రావడం పట్ల సీఎం రేవంత్ హర్షం

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 2:**
పారాలింపిక్స్‌లో భారత్ తరపున కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి జీవాంజి విశిష్ట క్రీడా పురస్కారం అర్జున అవార్డు 2024 కు ఎంపిక కావడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు, అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో సత్తా చాటే యువ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ప్రజా ప్రభుత్వ స్పోర్ట్స్ పాలసీలో భాగంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా 1 కోటి రూపాయలు, కోచ్ నాగపురి రమేష్ గారికి రూ. 10 లక్షల నగదు బహుమతిని గతంలోనే అందజేశారు. అదే సమయంలో దీప్తి  కి గ్రూప్-2 స్థాయి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు వరంగల్‌లో 500 గజాల స్థలం కేటాయించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.తెలంగాణ యువ క్రీడాకారులు మరింతగా రాణించాలని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్మితం కానున్న స్పోర్ట్స్ కాంప్లెక్సులు అందుకు దోహదపడతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.అలాగే క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఎంపికైన గుకేష్ (చెస్), హర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (ప్యారా అథ్లెటిక్స్), మను బాకర్ (షూటింగ్)లకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. 2024 లో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి అర్జున, ద్రోణాచార్య అవార్డులకు ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

## కల్వకుంట్ల కుటుంబం జైలుకెళ్లక తప్పదు

ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు కేసీఆర్ కుటుంబం పెద్దఎత్తున తెలంగాణ వనరులను కొల్లగొట్టి అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. నీతివంతులం.. నిజాయితీపరులమని మాట్లాడుతున్న మీ కుటుంబంపై ఎందుకు ఆరోపణలు వస్తున్నాయని నిలదీశారు. కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో ఇరుక్కొని తీహార్ జైలులో ఎన్ని రోజులు ఉందో రాష్ట్ర ప్రజలందరికి తెలుసు. అలాగే ఫార్ములా ఈ కేసులో రేపో మాపో కేసీఆర్ కుమారుడు కేటీఆర్ కూడా జైలుకు వెళ్లబోతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు కడియం శ్రీహరి. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కేసీఆర్, హరీష్ రావు అనేక విధాలుగా సాంకేతిక తప్పులు చేశారని ఆరోపణలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం అంతా రేపో మాపో జైలులో ఊచలు లెక్కపెట్టబోతున్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. మీరు నిజాయితీపరులు అయితే మీపై ఇన్ని కేసులు ఎందుకు నమోదు అవుతున్నాయని నిలదీశారు. 2014లో కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎన్ని.. ఇప్పుడు ఎన్నో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పుడు రూ.10 కోట్ల ఆస్తుల లేని మీకు.. ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని.. వందలాది ఎకరాల భూములు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. .

## అన్నా వర్సిటీలో అత్యాచార ఘటనలో న్యాయ పోరాటం ఏదీ

హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అన్నాయూనివర్సిటీ ఘటనపై విచారణ సందర్భంగా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై లైంగిక దాడి కేసు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసు దర్యాప్తులో పోలీసుల తీరు, రాష్ట్రంలో నెలకొంటున్న పరిణామాలపై మద్రాస్ హైకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను ఒక హెచ్చరికగా భావించకుండా రాజకీయం చేస్తున్నారని మండిపడింది. విద్యార్థినిపై లైంగిక దాడికి నిరసనగా ఆందోళన చేపట్టేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారంటూ పట్టలి మక్కల్ కట్చి పార్టీ.. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ పి.వేల్‌మురుగన్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌లో రాజకీయ కోణం తప్ప.. బాధితురాలికి న్యాయం చేయాలన్న తపన కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు నిరసనలను ఉపయోగించుకుంటున్నాయని, అందులో నిజాయితీ ఉండటంలేదని జస్టిస్ వేల్‌మురుగన్ అన్నారు. ఈ సందర్భంగా మీడియాపైనా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అలాగని, సమస్యలను రిపోర్టు చేయడం సరికాదనడం తన ఉద్దేశం కాదని చెప్పారు. కొన్ని విషయాల్లో మీడియా అనుసరిస్తున్న పద్ధతి సరికాదని వ్యాఖ్యానించారు. ' కులం, మతం, స్త్రీ,పురుష వివక్ష తదితర అసమానతలు కొనసాగుతున్న ఈ కాలంలో జీవించి ఉండటం నాకు సిగ్గేస్తోంది. నిజంగా మనమంతా సిగ్గుపడాలి. గట్టిగా చెప్పాలంటే.. అలాంటి నేరాల్లో మనమంతా సహనిందితులమే' అని జస్టిస్ వేల్ మురుగన్ అన్నారు. అన్నా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థినిపై డిసెంబరు 23న రాత్రి జరిగిన లైంగిక దాడి తమిళనాట తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. తన స్నేహితుడితో కలిసి వర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుతుండగా అక్కడికి ఇద్దరు వ్యక్తులు వచ్చి..ఆమె స్నేహితుడిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమెను ఫొటోలు తీసి, తమపై ఫిర్యాదు చేస్తే వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించారు. ధైర్యం చేసి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిని తీవ్రంగా పరిగణించిన మద్రాసు కోర్టు.. ఈ కేసు దర్యాప్తునకు కేవలం మహిళా అధికారులతోనే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఇప్పటికే ఏర్పాటు చేసింది. అంతేకాకుండా బాధితురాలికి రూ.25 లక్షల మధ్యంతర పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



కార్యవర్గ సభ్యులు, టీయుడబ్ల్యూజే, హెచ్.యూ.జే. అధ్యక్షులు, కార్యదర్శులు శిగా శంకర్ గౌడ్, హమీద్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నూతన సంవత్సరం సందర్భంగా సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి గురువారం నాడు గృహ నిర్మాణ, సమాచార, స్టాంప్స్ %డ% రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులు మంత్రి శ్రీనివాస్ రెడ్డి కి శుభాకాంక్షలను తెలియజేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి. జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ వి.పి. గౌతమ్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎస్. హరీష్ తదితర ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## గోవాలో ఏపీ యువకుడి దారుణ హత్య

**హైదరాబాద్, జనవరి 2 ( వెలుతురు):**
న్యూ ఇయర్ వేడుకల వేళ గోవాలో దారుణం జరిగింది. కొత్త సంవత్సరం వేడుకలకు గోవా వెళ్లిన ఆంధ్రప్రదేశ్ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. న్యూ ఇయర్ వేడుకల కోసం తాడేపల్లిగూడెం నుంచి ఓ ఎనిమిది మంది యువకులు గోవా వెళ్లారు. డిసెంబర్ 29వ తేదీన అర్ధరాత్రి గోవాలోని ఓ రెస్టారెంట్‌లో 8 మంది దిగారు. 31న అర్ధరాత్రి ఫుడ్ ఆర్డర్ విషయంలో వీరికి.. రెస్టారెంట్ సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఫుడ్ రేట్ల గురించి ప్రశ్నించిన యువకులపై రెస్టారెంట్ నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రవితేజ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా రవితేజ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై రవితేజ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# 14నుంచే రైతుభరోసా పంపిణీ

(మొదటి పేజీ తరువాయి..)
సబ్ కమిటీ నిర్ణయించింది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించనున్నారు. జనవరి 5 నుంచి 7 వరకు దరఖాస్తులు తీసుకునే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను చెల్లిస్తామన్న ప్రభుత్వం.. నాలుగో తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబులు సభ్యులుగా ఏర్పాటైన ఉపసంఘం ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమై చర్చించింది. రైతు భరోసా పంపిణీపై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ పథకం అమలు విధి విధానాల కోసం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ.. గురువారం నాడు కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో రైతు భరోసాకు సంబంధించి మంత్రివర్గ సభ్యులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతు భరోసా ఎవరికి ఇవ్వాలి.. ఎంతమేర భూమికి ఇవ్వాలి.. ఈ పథకానికి సంబంధించిన నిధులు రైతుల ఖాతాల్లో ఎప్పటి నుంచి జమ చేయాలి.. అనే అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పంట పండించే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని చర్చించారు. అలాగే.. రైతు భరోసా కోసం రైతుల నుంచి అప్లికేషన్స్ తీసుకోవాలని నిర్ణయించారు. జనవరి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించారు. అయితే, ఈ తేదీలను ఇంకా ఖరారు చేయలేదు. ఇక జనవరి 14వ తేదీన సంక్రాంతి పర్వదినం సందర్భంగా.. రైతుల ఖాతాల్లో రైతు భరోసా పథకం నిధులు జమ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి..)

**న్యూఢిల్లీ,జనవరి2( వెలుతురు):**
క్రీడా రంగంలో విశేష ప్రతిభకనబరిచిన క్రీడాకారులను అవార్డులతో కేంద్రం గౌరవించింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలకు నలుగురిని ఎంపిక చేసిన కేంద్రం.. అర్జున అవార్డుకు 32మందిని, ద్రోణాచార్య అవార్డుకు ఐదుగురిని ఎంపిక చేసింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 ఏడాదికి గాను నలుగురు క్రీడాకారులను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేసింది. చెస్ విభాగంలో డి.గుకేశ్, హాకీ విభాగంలో హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ విభాగంలో ప్రవీణ్ కుమార్, షూటింగ్ విభాగంలో మను బాకర్‌ను ఈ అవార్డులు వరించాయి. అలాగే, 32మందిని అర్జున, ఐదుగురికి ద్రోణాచార్య పురస్కారాలకు ఎంపిక చేశారు. అర్జున పురస్కారాలు దక్కించుకున్నవారిలో 17మంది పారా అథ్లెట్స్ ఉండటం విశేషం. జనవరి 17న ఉదయం 11గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వీరంతా పురస్కారాలను అందుకుంటారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.భారత స్వాతంత్ర్యం వచ్చాక.. ఒకే ఒలింపిక్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా మను బాకర్ ఘనత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ వ్యక్తిగత విభాగంతోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యాలను సొంతం చేసుకుంది. తొలి జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ప్రకటించిన జాబితాలో పేరు ఉండటంతో క్రీడాభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన గుకేశ్‌కు ఖేల్ రత్న అవార్డు వరించింది. ఫైనల్‌లో చైనా ప్లేయర్‌పై అద్భుత విజయంతో ఛాంపియన్‌గా నిలిచాడు. ఒలింపిక్స్‌లో వరుసగా భారత్ రెండో పతకం సాధించడంలో హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. పారాలింపిక్స్‌లో ప్రవీణ్ కుమార్ హై జంప్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఇక అర్జున అవార్డులు దక్కిన వారిలో ఇద్దరు తెలుగు అమ్మాయిలు ఉన్నారు. జ్యోతి యర్రాజి (అ÷-లథెటిక్స్),దీప్తి జువ్వాంజి ఉన్నారు. ఇక మిగిలిన వారిలో అన్ను రాణి (అ÷-లథెటిక్స్), నీతు (బాక్సింగ్), స్వీటీ బురా (బాక్సింగ్), అవంతిక అగర్వాల్ (చెస్), సలీమా (హాకీ), అభిషేక్ (హాకీ), సంజయ్ (హాకీ), జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), సుఖ్‌జీత్ సింగ్ (హాకీ) స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్), సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్),అమన్ (రెజ్లింగ్),రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్),ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్),అజీత్‌సింగ్ (పారా అథ్లెటిక్స్),సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్),ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్),హెచ్. హోకాటో సీమ(పారా అథ్లెటిక్స్), సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్), నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్), తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్), నిత్య శ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్) మనీశా రాం దాస్ (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జుడో),మోనా అగర్వాల్ (పారా షూటింగ్)రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్), అర్జున అవార్డ్స్ (లైఫ్‌టైమ్), సుచా సింగ్ (అ÷-లథెటిక్స్), మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్) ఉన్నారు. ఇక ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు) దక్కించుకున్న వారిలో సుభాష్ రాణా (పారా షూటింగ్), దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ సంగ్వాన్ (హాకీ), లైఫ్‌టైం కేటగిరీలో.. మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్‌బాల్) ఉన్నారు.

### ఎన్‌సీడీపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రివ్యూ
## పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై మంత్రి ఆరా

చేయాలని మంత్రి ఆదేశించారు. పేషెంట్లు రెగ్యులర్‌గా మెడిసిన్ వినియోగించేలా ఫాలోఅప్ చేయాలని సూచించారు. అలాగే, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాల బారిన పడ్డవారి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లైఫ్ స్టైల్‌లో చేసుకోవాల్సిన మార్పులపై పేషెంట్లకు వివరించాలన్నారు. జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్‌లో తలెత్తే అనారోగ్య సమస్యలపై వివరించాలన్నారు. ఈ మేరకు గురువారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి రివ్యూ చేశారు. కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ ఆఫీస్‌లో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేసిన ఎన్‌సీడీ సర్వే వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. 30 ఏండ్లు దాటిన 1.66 కోట్ల మందిని స్క్రీన్ చేయగా, 22.94 లక్షల మందికి బీపీ, 11.9 లక్షల మందికి షుగర్ ఉన్నట్టు గుర్తించామన్నారు. పేషెంట్లకు అవసరమైన మెడిసిన్‌ను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పేషెంట్ల జాబితాను రూపొందించాలన్నారు. పేషెంట్లను ఎన్‌సీడీ క్లినిక్స్‌కు అనుసంధానుంచాలన్నారు. ఎన్‌సీడీ క్లినిక్‌లలో అందే వైద్య సేవల వివరాలను పేషెంట్లకు తెలియజేయాలన్నారు. బీపీ, షుగర్ పేషెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెగ్యులర్‌గా అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మొబైల్ ద్వారా పేషెంట్లకు అవేర్‌నెస్ కల్పించడానికి , సమాచారం ఇవ్వడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. వారు రెగ్యులర్‌గా ట్రీట్‌మెంట్ తీసుకునేలా ఫాలోఅప్ చేయాలన్నారు. ఎన్‌సీడీ సర్వేను కొనసాగించాలని సూచించారు. కొత్తగా నమోదైన పేషెంట్ల వివరాలను, ఎప్పటికప్పుడు లిస్ట్‌లో అప్‌గ్రేడ్ చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ దవాఖాన్లలో ఎక్విప్‌మెంట్, మెడిసిన్, డాక్టర్లు, సిబ్బంది హాజరు, తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి చోటా కాంగ్రెస్సే విజయం



కార్యకర్తలనుద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు,2025 సంవత్సరంలో అంత మంచే జరుగుతుంది.. హుస్నాబాద్ గౌరవాన్ని మరింత పెంచుతా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ బలోపేతం పై పని చేయాలని ఆయన సూచించారు,స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గెలవాలి సర్పంచ్ లుగా మన వాళ్ళే గెలవాలన్నారు,ఎన్నికల్లో పోటీ చేసే వారు గ్రామాల్లో కష్టపడి పని చేయాలి నియోజకవర్గంలో విద్యా ,వైద్యం సాగునీరు అందించడం నా తొలి ప్రాధాన్యత అని మంత్రి ప్రభాకర్ అన్నారు,ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా చిగురు మామిడి, సైదాపూర్ మండలాలకు సాగు నీరు అందించే బాధ్యత నాది అన్నారు,ప్రజా పాలన ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామగ్రామాన ప్రతి ఇంట్లో అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు,ఇప్పటికే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ పూర్తి చేశాం. 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. మహిళలకు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,500 కి గ్యాస్ అందిస్తున్నామని మంత్రి ప్రభాకర్ తెలిపారు,ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుంది,కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి ,సంక్రాంతి కి రైతు భరోసా ఇస్తాం,సన్న వడ్లకి 500 బోనస్ ఇచ్చాం, వరి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు వేసాం అని మంత్రి తమ హామీల అమలు గురించి చెప్పారు, పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాం,ప్రభుత్వ ఉద్యోగులు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని చెప్పారు,ఇప్పటికే గ్రామాల్లో రోడ్లు ,ఓపెన్ జిమ్ ల నిర్మాణం జరుగుతుందని మంత్రి ప్రభాకర్ తెలిపారు,ప్రతి గ్రామానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తం,కేంద్రంలో ఉన్న బీజేపీ ఏం చేసిందో.. బీజేపీ , బిఆరెస్ లను ధీటుగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు,ఇచ్చిన హామీలు అన్ని అమలు చేశామంటూ మంత్రి ప్రభాకర్ ప్రకటించారు, ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు,

## కోటిమంది టిడిపి కార్యకర్తలకు బీమా

**అమరావతి,జనవరి2( వెలుతురు):**
కోటి మంది తెదేపా కార్యకర్తల బీమాకు మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు యునైటెడ్ ఇండియా కంపెనీతో పార్టీ తరపున ఎంవోయూ చేశారు. జనవరి 1 నుంచే ఇన్సూరెన్స్ కవర్ అయ్యేలా అగ్రిమెంట్‌ను రూపొందించారు. ఉండవల్లిలోని నివాసంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.



ఇందులో భాగంగా కార్యకర్తలకు ప్రమాద బీమా వర్తించనుంది. కోటి మంది కార్యకర్తల కోసం ఒకేసారి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం రాజకీయ పార్టీల చరిత్రలో ఇదే ప్రథమం. ఒప్పందం ప్రకారం జనవరి 1, 2025 నుంచి డిసెంబర్ 31, 2025 వరకు కోటి మంది కార్యకర్తల బీమా కోసం తొలివిడతలో రూ.42 కోట్లు పార్టీ చెల్లించింది. ఈ ఒప్పందం ప్రకారం కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. కార్యకర్తల సంక్షేమనిధి సారథిగా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక కేడర్ సంక్షేమమే లక్ష్యంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. కార్యకర్తల సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.138 కోట్లు ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో కేసుల్లో ఇరుక్కున్న కేడర్ కోసం న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రమాదాల్లో దెబ్బతిన్న కార్యకర్తలను ఆదుకునేందుకు కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. మృతిచెందిన కార్యకర్తల పిల్లల కోసం హైదరాబాద్‌తో పాటు కృష్ణా జిల్లా చల్లపల్లిలో ఎన్టీఆర్ ట్రస్టు తరఫున రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యనందిస్తున్నారు.

## సిఎంఆర్ కాలేజీ హాస్టల్‌లో రహస్య చిత్రీకరణ

**హైదరాబాద్,జనవరి2( వెలుతురు):**
మేడ్చల్ సీఎంఆర్ కాలేజీలో బాత్రూంలో దశ్యాలను చిత్రీకరించారని బుధవారం విద్యార్థినులు ధర్నాకు దిగిన వ్యవహారంలో వివాదం చెలరేగింది. దీంతో తెలంగాణ మహిళా కమిషన్ సుమోటోగా స్పందించింది. కాలేజీ ఘటనపై తక్షణమే నివేదిక సమర్పించాలని సైబరాబాద్ కమిషనర్‌కు మహిళా కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అమ్మాయిల బాత్ రూమ్‌లలో కెమెరాలు పెట్టి 300కు పైగా అశ్లీల వీడియోలు తీసినట్లుగా వచ్చిన మీడియా కథనాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు ఈ ఘటనపై విద్యార్థినిలు, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. కళాశాలల చైర్మన్ గోపాల్ రెడ్డి విద్యార్థి సంఘాల నేతలతో చర్చలు జరిపారు. కాగా సీఎంఆర్ కాలేజీ ఘటనపై యాజమాన్యం నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.మేడ్చల్ సీఎంఆర్ కాలేజీ లేడీస్ హాస్టల్ బాత్ రూమ్‌లో విద్యార్థినుల నగ్న వీడియోలు చిత్రీకరించారని స్టూడెంట్స్ చేస్తోన్న ఆందోళనపై ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణ స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..విద్యార్థినులు బుధవారం మధ్యాహ్నం తమకు కంప్లైంట్ చేశారని ఆయన తెలిపారు. కుకింగ్ డిపార్ట్‌మెంట్‌లోని కొందరు అనుమానితులను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వార్డెన్ టర్మినేట్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారని.. వారి కోరిక మేరకు హాస్టల్ వార్డెన్ ను విధుల నుండి తొలగించామన్నారు. ఈ విషయంలో అండగా ఉంటామని విద్యార్థునులకు హామీ ఇచ్చామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. హాస్టల్ సీసీ టీవీ ఫుటేజ్ పోలీసులకు ఇచ్చామని.. పోలీసుల విచారణకు పూర్తిగా సపోర్ట్ చేస్తామన్నారు. ఘటన నుండి హాస్టల్ వార్డెన్ ప్రీతిని మేం తప్పించినట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని.. ఇప్పటికే మేం ఆమెను టర్మినేట్ చేశామని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఐదుగురు లేడి సీనియర్ స్టాఫ్‌తో కమిటీ వేసి విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. స్టూడెంట్స్ మా పిల్లలతో సమానమని.. వారి భద్రతే మాకు ముఖ్యమన్నారు. నిందితులు ఎవరైనా సరే సీరియస్ యాక్షన్ తీసుకొంటామని స్పష్టం చేశారు. హాస్టల్ బాత్ రూమ్‌లో మొబైల్ ఫోన్లు పెట్టి తమ నగ్న వీడియోలు చిత్రీకరిస్తున్నారంటూ సీఎంఆర్ కాలేజీ విద్యార్థునులు బుధవారం ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. స్టూడెంట్స్‌కు మద్దతుగా విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగి.. కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్నాయి. ఈ ఘటనపై దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు.. హాస్టల్ కుకింగ్ డిపార్ట్‌మెంట్‌లో కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## సీఎం రేవంత్ రెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సత్యం శ్రీరంగం, కృష్ణ రాజ్ పుత్...



**కూకట్ పల్లి జనవరి 2 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని వారి నివాసంలో టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజ్ పుత్ లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవతో పని చేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. సీఎం నాయకత్వంలో ఈ నూతన సంవత్సరంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## సిఐ ముత్తు కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పురేందర్ రెడ్డి...



**కూకట్ పల్లి జనవరి 2 వెలుతురు:**
నూతన సంవత్సరం సందర్భంగా కూకట్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్తు, ఎస్ఐలు రామకృష్ణ, సంజీవ లను వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి పోలీస్ స్టేషన్లో వారిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ ని వనపర్తి జిల్లా కురుమూర్తి స్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ జనంపల్లి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పురేందర్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ముత్తు మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరికీ ఆరోగ్యం, అష్టైశ్వర్యాలతో కలగాలని భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీధర్ రావు, ప్రసాద్, శ్రీనివాసరావు, రామరాజు, జి .ప్రసాద్, ఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన శేరి సతీష్ రెడ్డి



**కూకట్ పల్లి జనవరి 2 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి గురువారం బంజారాహిల్స్ లోని మంత్రుల సముదాయంలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీని మరింత అభివృద్ధి కోసం ప్రతి నాయకులు కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. శేరి సతీష్ రెడ్డి, నియోజకవర్గంలోని పలు సమస్యలను, అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.సంజీవరావు, డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, మేకల మైకల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పనింద్ర కుమార్, కూకట్ పల్లి మాజీ ఉపాధ్యక్షులు రేష్మ, విజయమ్మ, శ్రీధర్ చారి, బాబురావు, రామకృష్ణారెడ్డి, గిరి నాయుడు, రాజు, ప్రకాష్, వెంకటేష్ గౌడ్, పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సతీష్ అరోరా కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వల వల నాయుడు..



**కూకట్ పల్లి జనవరి 2 వెలుతురు:**
కూకట్ పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ ఆరోరా ని కెపిహెచ్బి కాలనీ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వలవల నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మిఠాయిలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాతూరి గోపి, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం లోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభ్యుత్వం

## బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్




**తుర్కయంజాల్ వెలుతురు జనవరి 02:**
గురువారం రోజున తుర్కయంజాల్ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో పత్రిక విలేకరుల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ మునిసిపాలిటీలో గత రెండు నెలలుగా సంస్థాగతపరంగా పార్టీ సభ్యతము మరియు బూత్ కమిటీల ఎంపిక పూర్తయిందని తెలిపారు. మున్సిపాలిటీలో గల 52 బూతులకు గాను సుమారు 5900 సభ్యత్వాలు పూర్తయినట్టు తెలిపారు 52 బూత్ కమిటీలకు గాను 29 బూత్ కమిటీలు పూర్తి చేసినట్లు నాయకులు ప్రకటించారు మిగతా బూత్ కమిటీలను తొందరలోనే ప్రకటించి రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తున్నట్లు తెలిపారు. 42 క్రియాశీల సభ్యుల్ని నమోదు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా అడుగులు వేస్తుందని ఆయన పేర్కొన్నారు కార్యక్రమం లో పాల్గొన్న సీనియర్ నాయకులు రైతు సేవాసహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి రాష్ట్ర ఎస్సిమోర్చా కోశాధికా రి బచ్చిగళ్ల రమేష్ మరియు కందాల బల్ దేవ్ రెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్ యోజన పథకం కింద ఇంతకు ముందు సంవత్సరానికి 6000 రూపాయలు ఇస్తున్నటువంటి ప్రభుత్వం ఇప్పుడు బదిలీని 10000 రూపాయలకు పెంచడం హర్షనీయమని పేర్కొన్నారు మరియు సేంద్రియ ఎరువుల మీద సబ్సిడిని ప్రకటించినందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని గతంలో ఇచ్చే సబ్సిడీ కంటే ప్రస్తుత కొత్త సంవత్సరంలో 3850 కోట్లను పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొనడం హర్షించదగ్గ విషయమని నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాన్ని మరింత ప్రజలకు చేరువ విస్తరించి అట్టడుగు స్థాయిలో ఉండేటువంటి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించేదానికి భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు విశేషంగా కృషి చేయాల్సినటు వంటి అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు తూళ్ల నర్సింహా గౌడ్ సీనియర్ జిల్లా నాయకులు బిక్షపతి కొంతం బాల్ రెడ్డి రాంరెడ్డి యూసఫ్ రెడ్డి యువమోర్చా అధ్యక్షులు ఎలిమినేటి నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కమ్యూనిస్ట్ సైద్ధాంతిక తత్వవేత్త ఏబి.బర్ధన్ : సీపీఐ నేతలు



**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, జనవరి 2:**
అబ్దుల్లాపూర్ మెట్ మండలం, (పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ )రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్-3 భూ పోరాట కేంద్రంలో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబి బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా బర్ధన్ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించిన సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి ,రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలువారు దఈసందర్భంగా వారుమాట్లాడుతూ ఏబీ. బర్ధన్ తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. బర్ధన్ విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని, 80,90 దశకంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం బర్ధన్ పోరాట యోధులకు ఉపరాష్ట్రపతి పదవిని తీసుకోకుండా సున్నితంగా తిరస్కరించారు.


నా జీవితం ప్రజలు, పార్టీ కార్యకర్తలతోనే అని చెప్పడం బర్ధన్ నిస్వార్థతకు అద్దం పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ అజ్మీర హరిసింగ్ నాయక్ ఏఐటియుసి అబ్దుల్లాపూర్ మెట్టు మండల అధ్యక్షులు దాసరి ప్రసాద్ ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ కేతరాజు నర్సింహ్మా, , సైదులు ముదిరాజ్,ఏఎస్ ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, యాదిగిరి, వీరేష్, శంకర్ నాయక్, నరసింహా, రంగారెడ్డి జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు,కాటి అరుణ, దేవమ్మ, సుభద్ర, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు



# సంపాదకీయం..

## అన్నదాతలను వంచిస్తున్న ప్రభుత్వాలు !


వ్యవసాయ సంక్షోభాన్ని అధ్యయనం చేసి, అన్నదాతలను గట్టెక్కించే ప్రయత్నాలు ఏవీ ముందుకు రావడం లేదు. హామీలన్నీ అటకెక్కుతున్నాయి. ఎన్నికల ముందు అన్ని పార్టీలు అన్నదాతల గురించి, వారి సమస్యల గురించి చర్చిస్తారు. అందమైన అబద్ధాలను ఇంపుగా చెబుతారు. గద్దెనెక్కాక యధావిధిగా మర్చిపోతున్నారు. అందుకే దేశంలో వ్యవసాయరంగం లాభసాటిగా లేకుండా పోతోంది. రైతులకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. మద్దతు ధరల విధానం సక్రమంగా అమలు కావడం లేదు. దగాపడుతున్న అన్నదాతను ఆదుకునే ప్రయత్నాలు కేవలం కంటితుడుపు చర్యగానే ఉన్నాయి. సకాలంలో ఎరువుల అందవు. విత్తనాల కొరత యధావిధిగా ఉండనే ఉంటుంది. ఎరువులు, నకిలీ విత్తనాలు, మార్కెట్లో మోసాలను తట్టుకుని మనకు అన్నం పెడుతున్న రైతన్న విషయంలో ఏ ప్రభుత్వం అయినా న్యాయం చేయడం లేదు. నిలదీస్తే వారిని నిలువరిస్తున్నారు. దేశంలో గత మూడు దశాబ్దాల్లో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఇటీవల సుప్రీంకోర్టు తనకందిన అధికారిక నివేదిక నుంచి పేర్కొంది. నివేదికలకెక్కని చావులను కూడా పరిగణన లోకి తీసుకుంటే ఈ ఆత్మహత్యల లెక్క ఏడు లక్షలకు పైబడే ఉంటుందని పరిశీలకుల అంచనా. వ్యవసాం ఒక ప్రధాన జీవన రంగంగా సాగుతున్న దేశంలో రైతుల పరిస్థితి ఇంత దుర్భరంగా ఉండడం చాలా బాధాకరం. కేంద్ర ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చకపోగా ఎరువుల ధరలను పెంచి, సహకార వ్యవస్థలను, మార్కెట్టు యార్డులను నిర్వీర్యపర్చి మరిన్ని ఇక్కట్లకు గురి చేస్తోంది. కేంద్రంలోని బిజెపి తాను అమలు చేస్తామని అనేకసార్లు వల్లించిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి తదితర 11 డిమాండ్లతో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ నవంబరు 26వ తేదీన నిరాహార దీక్ష చేపట్టి నెలరోజులు గడిచిపోయినా కేంద్రప్రభుత్వ పెద్దల్లో కనీస చలనం లేకపోవటం శోచనీయం. ఎండనక వాననక ఆరుగాలం చెమటోడ్చి కష్టించే అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాలతో ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. వాటికి అదనంగా దళారుల మోసాలు, మార్కెట్ ధర పతనాలు, రవాణా భారాలూ చేరి, కష్టాలూ కన్నీళ్లే దిగుబడులుగా వ్యవసాయాన్ని వ్యయభరితంగా మార్చేశాయి. ఈ దుర్భర స్థితి నుంచి రైతును రక్షించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కష్టాలను మరింత పెంచుతు న్నాయి తప్ప, భరోసాగా నిలవటం లేదు. మోసకారి విధానాలతో అన్నదాతల ఉసురు పోసుకోవటం పాలకులకు పరిపాటిగా మారింది. రైతు దేశానికి వెన్నెముక అంటూ ఉపన్యాసాలు ఊదరగొట్టే ప్రభుత్వాలు ఆ వెన్నెముకను కర్కశంగా విరిచేసే చేతలకు తెగిస్తున్నాయి. చేసిన శ్రమకు, ఉత్పత్తికి కనీసంలో కనీసంగా ఖరీదు కట్టటం అనేది ఒక సాధారణ న్యాయం. కానీ, ఈ సాధారణ న్యాయం దశాబ్దాల తరబడి రైతులకు అందటం లేదు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న అంశానికి చట్టబద్ధత కల్పించటం ఇంకా ఎండమావిగానే ఉంది. వ్యవసాయరంగం సంక్షోభం నుంచి బయటపడటానికి గతంలో స్వామినాథన్ కమిషన్ కొన్ని సిఫార్సులు చేసింది. పంటలకు మద్దతు ధరను ఇవ్వాలని, సింగిల్ యూనిట్ ప్రాతిపదికన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని, మార్కెట్ సదుపాయాలు పెంచాలని సూచనలు చేసింది. దశాబ్దం క్రితం వరకూ అధికారంలోకి రాక ముందు బిజెపి బలంగా వినిపించిన ఎన్నికల వాగ్దానాల్లో ఇవన్నీ ఉన్నాయి. గద్దెనెక్కాక ఆ హామీలను ఆవలకు విసిరేసి, రైతులకు పంగనామాలు పెట్టే పనికి సమాయత్తమైంది! ఉన్న రాయితీలను తీసేసి, మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే దుస్సాహసానికి ఒడిగట్టింది. వాటిని వెనక్కి తీసుకోవాలని లక్షలాదిమంది రైతులు నెలల తరబడి, ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక పోరాటం చేశారు. తప్పని పరిస్థితుల్లో మోడీ క్షమాపణలు చెప్పి, ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ, ఆ తరువాత ఈ మూడేళ్లలో రైతులను ఉద్ధరించే చర్య ఒక్కటంటే ఒక్కటీ చేపట్టలేదు. ఏడాదికి మూడు విడతలుగా విదిల్చే రూ.6 వేల సహాయాన్నే గొప్ప ఉపకారంగా మోడీ పరివారం చెప్పుకుంటోంది. అలాంటి అరకొర విదిలింపులతో దేశ వ్యవసాయ రంగానికి ఒరిగేది ఏమీ ఉండదు. రైతు సమస్యలపై అధ్యయనం చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల విడుదల నివేదిక కూడా దీనినే స్పష్టం చేస్తోంది. కనీస మద్దతు ధరకు గ్యారంటీ, రుణమాఫీ, పిఎం కిసాన్ నిధుల రెట్టింపు, బ్జడెట్లో వ్యవసాయరంగ వాటా పెంపు వంటి ప్రతిపాదనలు చేసింది. మోడీ ప్రభుత్వం తాను చెప్పుకుంటున్నట్టు రైతులకు ఇప్పటికే చాలా మేళ్లు చేసివుంటే- కొత్తగా ఈ ప్రతిపాదనలు ఎందుకు? రైతాంగం పట్ల కత్తి కట్టినట్టు వ్యవహరించే ధోరణికి బిజెపి ప్రభుత్వం ఇకనైనా స్వస్తి పలకాలి. రైతుల న్యాయమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలి.భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ఉదారవాద ఆర్థిక విధానాలను విడనాడాలి. రైతు నిశ్చింతగా ఉండటానికి, వ్యవసాయ రంగం నిలబడటానికి ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి. వీటి విషయంలో ఖచ్చితమైన నిబంధనలు రావాలి. అప్పనంగా రైతుల న ఉంచి భూములను లాక్కోవడం, వారికి అరకొరగా విదిల్చడం చేస్తున్నారు. మద్దతు ధరలు, ఎరువుల విధానం, మార్కెట్ల బలోపేతం వంటివన్నీ సక్రమంగా జరగాలి. భూములను అప్పనంగా గుంజుకునే విధానం పోవాలి. లాఠీఛార్జీలు చేయడం, వారిని రోడ్డెక్కించే బరితెగింపు పనులు ఇకముందు సాగకుండా చూడాలి. పారిశ్రామిక వేత్తలకు భూములు కావాలంటే బహిరంగ వేలంలో కొనుగోలు చేసుకునేలా కఠిన చట్టాలు తీసుకుని రావాలి. ఇలా చేస్తే తప్ప అన్నదాత మనుగడ సాగదు.



## వలూర్ గ్రామంలోని సెలూ తాలూకా, పరభణి, మహారాష్ట్రలో ఎనిమిది ప్రవేశద్వారాలు కలిగిన సొరంగ బావి

ఈ కళాత్మక బావి 400 సంవత్సరాల క్రితం నిర్మించబడింది. ఈ బావి గోధుమ, సోయాబీన్, పత్తి పంటలతో చుట్టూ ఉన్న చిన్న గ్రామంలో ఉంది. బావి వ్యాసం 20 మీటర్లు, లోతు 20 మీటర్లకు పైగా ఉంది. ఈ బావి ప్రత్యేకత ఎనిమిది ప్రధాన దిశలలో వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసిన ఎనిమిది ప్రవేశద్వారాల్లో ఉంది. బావికి దిగేందుకు ఉన్న మెట్లు వెడల్పుగా, అల్పమైన మోస్తరు నిటారుగా ఉంటాయి, వీటిపై నడవడం సులభం. ఈ మెట్లు సమాంతరంగా ఉండడం వలన బావి యొక్క అందాన్ని మరింత మెరుగుపరుస్తుంది. బావి రూపకల్పన వర్షపాతం ఎక్కువగా ఉండే ప్రాంతంలో నీటిని సేకరించేందుకు అనుకూలంగా ఉంటుంది. నీటిమట్టం ఆధారంగా వివిధ స్థాయిలకు నీరు చేరే విధంగా దీన్ని నిర్మించారు. ఎనిమిది ప్రవేశద్వారాలు అప్పటి వివిధ సమాజాలకు నీటి అందుబాటును సులభతరం చేయడానికి రూపొందించబడ్డాయి. ఈ కళాత్మక బావి నీటి మూలం మాత్రమే కాకుండా, సామాజిక ఐక్యతకు కూడా ప్రతీకగా నిలిచింది. ఈ బావి ప్రత్యేకత దాని సంక్లిష్టమైన ఆకృతి మరియు ఆర్కిటెక్చర్‌లో ఉంది. బావి దక్షిణ హెలిక్స్ ఆకారంలో నిర్మించబడింది, బయట చక్రం నుండి మధ్యలో స్పైరల్ ఆకారంలో సాగుతుంది. బావి గోడలు అందమైన చెక్కల నమూనాలతో అలంకరించబడి ఉంటాయి, ఇవి చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ బావిని సందర్శించే పర్యాటకులు దాని విశాలత మరియు అందచందాలను చూసి మంత్రముగ్దుల వుతారు. సాధారణమైన బావి నిర్మాణం వందల ఏళ్లుగా సమాజానికి ఎంతటి అవసరమైన వనరును అందించిందో చూసి ఆశ్చర్యపోతారు. స్థానికులు తమ వారసత్వంపై గర్వపడుతూ, తమ చరిత్రను, సంప్రదాయాలను సందర్శకులతో పంచుకోవడానికి సంతోషంగా ఉంటారు.

# భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయుని సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినంగా ప్రకటించాలి.




సావిత్రీబాయి పూలే

*మహాత్మాగాంధీ లేదా స్వామి వివేకానందుల వలె సావిత్రిబాయి పూలే సుప్రసిద్ధురాలు కాకపోవచ్చును. కానీ భారతీయ మహిళా విముక్తి పై ఆమె ప్రభావం అద్భుతమైనది. 19వ శతాబ్దపునాటి అజ్ఞానపు చీకట్లను చీల్చుతూ బానిస సంకెళ్లను తెంచి సమాజంలో మహిళలకు, వితంతువులకు, బాలికలకు, అణగారిన వర్గాలకు విద్య మరియు గౌరవాన్ని సాధించిన విదుషీమణి సావిత్రిబాయి. సావిత్రిబాయి జన్మదినాన్ని జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళోద్ధరణకు సావిత్రిబాయి చేసిన సేవలు అనన్యం అసామాన్యం. సావిత్రిబాయిని భారతీయ మొదటి తరం స్త్రీవాదిగా వర్ణిస్తారు.*

### సావిత్రీబాయి పూలే జీవిత విశేషాలు:

సావిత్రీబాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో, 1831 జనవరి 3న ఒక రైతు కుటుంబంలో జన్మించింది. సావిత్రి బాయికి 9వ యేట 12 యేండ్ల జ్యోతిరావు పూలేతో 1840 లో వివాహము జరిగింది. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. జ్యోతీరావు పూలె ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. కొల్హాపూర్ లోని ఫర్రార్ ఇన్సిస్ట్యూట్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది, 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించింది. ఇలా పాఠశాల ఏర్పాటు చేసి నడుపటము ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతికదాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. అందుకోసం ఆమె తనవెంట రెండు చీరలు తీసుకెళ్ళేది. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా “నా విధిని నేను నిర్వహిస్తున్నాను” అని చెప్పేది. అయినా రోజూ వేధింపులకు విసిగి వేసారిన సావిత్రీబాయి ఒకరోజు ఒకడి చెంప పగులకొట్టింది. పట్టు వీడక వారు సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ కాలంలోనే సమాజము నుండి సహకారం, గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి తన ఇంటిని బడికి ఇచ్చాడు. కొంత మంది పుస్తకాలు సేకరించారు. మోరోవిఠల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించారు. బాలికల చదువు కోసం, విద్యాభివృద్ధి కోసం సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేసింది.

### ఉపాధ్యాయురాలుగా సావిత్రీబాయి:

అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు, సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన మన భారత దేశంలో, ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి జనవరి 1, 1848లో మొదటి బాలికల పాఠశాలను వివిధ కులాలకు చెందిన 8 మంది అమ్మాయిలతో పూణెలోని భేద్వాడాలో స్థాపించారు. ఆడపిల్ల గడపదాటని ఆ రోజుల్లో అడుగు బయటపెట్టి మహిళల విద్యకోసం ఉద్యమించింది మన సావిత్రిబాయి. అట్లా భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచింది. సమాజంలో తనకు ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి, ఉచిత విద్యనందించారు. దళితుల, స్త్రీల విద్యావ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలోనే 1849లో పూలే, సావిత్రీబాయి దంపతులను గృహ బహిష్కారానికి గురిచేశారు.

### సంఘ సంస్కర్తగా, సామాజిక విప్లవకకారిణిగా:


ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. లింగ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలేనే. అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873 సెప్టెంబరు 24న తన భర్త మహాత్మా పూలేతో కలసి “సత్యశోధక్ సమాజ్ “ను ప్రారంభించి బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునర్వివాహాల కొరకు అసమాన బ్రాహ్మణ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. ఈ సత్యశోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యశోధక్ సమాజ్ ఆధ్వర్యాన సావిత్రీబాయి వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి, 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాథ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. నేడు సర్వ శిక్ష అభియాన్, విద్య హక్కు చట్టం మరియు విద్యను ప్రోత్సహించడానికి మధ్యాహ్న భోజన పథకం లాంటి పథకాలు ప్రోత్సాహకాలు ఉండవచ్చు. కానీ సావిత్రిబాయి పూలే 16 దశాబ్దాల క్రితమే పిల్లలు బడి మానకుండా ఉండేందుకు తమ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగును చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దే వదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. ఆ బిడ్డను దత్తత తీసుకుని యశ్వంతరావుగా (బ్రాహ్మణ వితంతువు కుమారుడు) నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు.

వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లో ఆమె తన కవితా సంపుటి “కావ్యఫూలే” ను ప్రచురించింది. మరో కవితా సంపుటి “పావన కాశీ సుబోధ్ రత్నాకర్” ను 1891లో ప్రచురించింది. ఆమె ఉపన్యాసాలలో కొన్ని 1892లో పుస్తక రూపంలో వచ్చాయి.

జ్యోతీరావుపూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగింది. ఈ దుఃఖంలో నుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టింది. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పు పెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. పూలే మరణాంతరం సత్యశోధక్ సమాజ్ బాధ్యతనీ స్వీకరించి నడిపించింది. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కలిసి వ్యాధిగ్రస్తులకు సేవలు చేసారు. 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు, పేదల కోసం జోలెపట్టి విరాళాలు సేకరించి వారికి అందించారు. ప్లేగు వ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించింది. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించింది. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి దళిత కులాలకి చెందిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో మరణించింది. ఆమె దత్తపుత్రుడు యశ్వంతరావు అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రి బాయి జయంతిని నేడు భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాము. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా బిళ్ళను విడుదల చేసింది. పూణే విశ్వవిద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు.

ఆమె నిరుపమాన సేవలను నిత్యం స్మరించుకోవాల్సిన బాధ్యత ఆధునిక భారత సమాజంపైన ఎంతైనా ఉంది. ఇంతటి అసామాన్యమైన కృషి సల్పిన భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయుని సావిత్రిబాయి పూలే జన్మదినమైన జనవరి 3 ను “జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం” గా ప్రకటించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాము.

ఆమె ఆమె భావాలను, ఆదర్శాలను స్మరించుకుంటూ వాటికోసం పునరంకితం కావడమే మనం వారికి అందించే నిజమైన నివాళి.



ఇంజమూరి రఘునందన్,
సెల్: 9866102962
తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు
(నేడు సావిత్రిబాయి పూలే జన్మదినం)

## బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బీసీని నియమించాలి

### - జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 02:**
బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బిసిని నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అంటేనే కుటుంబ పార్టీ అనే పేరు ఉందని అధ్యక్షులు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు ఎలా వుంటారని బీసీల పట్ల నిజంగా బీఆర్ఎస్ కు ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే అధ్యక్షునిగా ఒక బీసీని నియమించి బిఆర్ఏస్ పార్టీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.



## కవిత పై పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు బేషరతుగా వెనక్కి తీసుకోవాలి

### బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొన్నునూరి శ్రీకాంత్ గౌడ్.

హైదరాబాద్ వెలుతురు జనవరి 02:
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కవిత పై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం. బి.సి ల ఓట్లతో గెలిచిన మీరు ఏడాది పాలన పూర్తి అయిన కూడా బి.సి హామీలు ఏ ఒక్క హామీ నెరవేర్చారో చెప్పాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి ఆరు నెలల్లో కామారెడ్డి బి.సి డిక్లరేషన్ అమలు చేస్తా అన్నారు.దాని ఊసే లేదు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కులగణన చేసి స్థానిక సంస్థలో బి.సి లకు 42 % రిజర్వేషన్లు పెంచుతామన్న హామీ ఏమైందో చెప్పాలి. బి.సి సబ్ ప్లాన్ నిధులు సంవత్సరానికి 20వేల కోట్లు కేటాయిస్తమని చెప్పి,కేవలం 150 కోట్లు బడ్జెట్లో కేటాయించడంతో బి.సి ల పట్ల మీ చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుంది. బి.సిల గురించి పాలన వ్యక్తులే మాట్లాడాలని రాజ్యాంగంలో ఎక్కడ లేదని,బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతుందని కవిత చేస్తున్న ఉద్యమాన్ని చూస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రదినిధులు ఓర్వలేక పోతున్నారు. బి.సి ఎమ్మెల్సీగా ఉన్న మీరుకాని, మీ బి.సి ప్రజాప్రదినిధులు గాని బి.సి లకు జరుగుతున్న అన్యాయాల గురించి మీరు ప్రభుత్వంలో ఉండి ఏం చేసారో చెప్పాలి. అలాగే ఎన్నికల్లో మీరు గెలవడం కోసం బి.సి లను మోసం చేసినందుకు తక్షణమే క్షమాపణలు చెప్పుతూ, ఇచ్చిన హామీలన్నీ అమలు చెయ్యాలి. లేని పక్షంలో మీరు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు కవిత నాయకత్వంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నము.



## ఐసిఏఆర్-డైరెక్టరేట్ అఫ్ పౌల్ట్రీ రీసెర్చ్ ను సందర్శించిన జాతీయ ఎస్.టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్



**రంగారెడ్డి జిల్లా వెలుతురు జనవరి 02:**
ఐసిఏఆర్-డైరెక్టరేట్ అఫ్ పౌల్ట్రీ రీసెర్చ్ (భావ్యపమం-కోళ్ళ పరిశోధన డైరీ ఫారం రాజేందర్ నగర్ సంచలనాలయము)ను సందర్శించిన జాతీయ ఎస్.టి కమిషన్ మెంబర్ శ్రీ జాటోతు హుస్సేన్ నాయక్ బొక్క నరసింహారెడ్డి వై శ్రీధర్ బొక్క బాల్ రెడ్డి బాబురావు ప్రకాష్ వంశీ యాదగిరి హర్షిత్ రెడ్డి

## మేడ్చల్ నియోజకవర్గంలో మెట్రో రైలు



**మేడిపల్లి, వెలుతురు:-**
మెట్రో రైలు మార్గం తమ ప్రాంతానికి గత కొన్ని సంవత్సరాలుగా అందని ద్రాక్షగా మారిందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేద్ యాదవ్ అన్నారు.. ఈ మేరకు హైదరాబాదు నార్త్ మెట్రో రైలు విస్తరణ పనులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా గురువారం సీఎం రేవంత్ రెడ్డిని తన నివాసంలో ఆయన మర్యదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు..

## ఎమ్మెల్యేను కలిసిన జేపల్లి గ్రామ పంచాయతీ నాయకులు



**వెలుతురు, చారకొండ, (జనవరి 2) :**
కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గురువారం చారకొండ మండలం, జేపల్లి గ్రామ పంచాయతీకి చెందిన పలువురు నాయకులు హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలబొక్కె అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న వివిధ అభి వృద్ధి పనులపై, గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించారు. సానుకూ లంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యు లు వెల్జాల వెంకటేష్, మల్లేపాకుల శేఖర్, నాయకులు పవన్ నాయక్, కొర్ర రాజు నాయక్, యాదగిరి, శేఖర్, కృష్ణ, పరుశురాం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముండ్లమూరులో మరోసారి భూకంపనలు

**అమరావతి, జనవరి 2 ( వెలుతురు):**
ప్రకాశం జిల్లాలో మరోసారి భూప్రకంపనలు భయాందోళనలకు గురిచేశాయి. గురువారం మధ్యాహ్నం జిల్లాలోని రేపాయి, ముండ్లమూరు మండలంలోని గ్రామాల్లో సెకన్ పాటు భూమి కంపించింది. దీంతో భయాందోళనకు గురైన స్థానికులు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గత నెల ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలంలో గత నెల 21,22వ తేదీల్లో వరుసగా ఉదయం 10.35 నుంచి 10.40 గంటల మధ్య కొన్ని క్షణాలపాటు రెండురోజులు భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు లోనయ్యారు. ముండ్లమూరు, శింగన్నపాలెం, వేంపాటు, పెద్దఉల్లగల్లు, పసుపుగల్లు గ్రామాల్లో భూమి కంపించిందని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. తాజాగా గురువారం కూడా ఇదే మండలంలోని పలు గ్రామాల్లో భూమి కంపించడం ఆందోళనకు గురి చేస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

## డ్రైవర్ లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**మేడిపల్లి, వెలుతురు:-**
పరధ్యానం లేకుండా విధులు నిర్వర్తించినప్పుడే ప్రమాద రహిత డ్రైవింగ్ సాధ్యమవుతుందని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు.. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమాన్ని ఘట్ కేసర్ ట్రాఫిక్ ఎస్ఐ మల్లయ్యతో కలిసి గురువారం ఆమే ప్రారంభించారు.. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కవిత మాట్లాడుతూ.. డ్రైవర్ లు ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం ద్వారానే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ మల్లయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రైవింగ్ చేసే ముందు అలసటకు గురి కాకుండా మానసిక ప్రశాంతతతో విధులు నిర్వర్తిస్తే ప్రమాదాలను నివరించవచ్చన్నారు. డ్రైవింగ్ చేసే పనిపై పూర్తి శ్రద్ధ ఉంటే ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపును పొందుతారన్నారు. బస్సును నిలిపేటప్పుడు బస్సు బే లోనే ఆపాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను దాటేయాలని ఆత్రుతతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. మనం, మన కుటుంబ సభ్యులు క్షేమంగా రోడ్డుపై వెళ్లేవారు సురక్షితంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ విధులను కర్తవ్య దీక్షతో నిర్వర్తించాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (మెకానికల్) సాయి సుబ్రహ్మణ్యం, సూపరిండెంట్ ట్రాఫిక్ వెంకటేశ్వర్లు డిప్యూటీ సూపరిండెంట్ అరుణ లక్ష్మి, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ అక్బర్, లైసెనింగ్ ఆఫీసర్ కృష్ణ, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ లు తదితరులు పాల్గొన్నారు...




## టూరిస్టులకు ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ బంపర్ ఆఫర్లు..

## అతి తక్కువ ధరలకే దేశీయ, విదేశీ టూర్లు...




**కూకట్ పల్లి జనవరి 2 వెలుతురు:**
తెలుగు రాష్ట్రాల్లో అగ్రగామి ట్రావెల్స్ ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ పర్యాటకుల కోసం ఆకర్షణీయమైన ప్యాకేజీలు తీసుకొచ్చినట్టు ఆర్వీ ట్రావెల్స్ ఎండీ ఆర్వీ రమణ తెలిపారు. గురువారం కూకట్పల్లి బ్రాంచ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెరుగైన సౌకర్యాలతో అతి తక్కువ రేట్లకే దేశీయ, విదేశీ అనేక ఆధ్యాత్మిక విహార యాత్రలను అందిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ట్రావెల్ రంగంలో దాదాపు 25 సంవత్సరాలుగా తెలుగు, కన్నడ రాష్ట్రాల ప్రజలకు అపార సేవలు అందిస్తున్న ఆర్ వి టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎక్స్పో 2025 మెగా మేళాను నిర్వహిస్తుందన్నారు. 16 డిసెంబర్ 2024 నుండి 31 జనవరి 2025 వరకు హైదరాబాద్ ,బెంగుళూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కరీంనగర్, ప్రొద్దుటూరులో దాదాపు 45 రోజులపాటు నిర్వహించనున్న ఈ మేళాలో కష్టమర్లకు అతి తక్కువ ధరలలో దాదాపు వందకు పైగా దేశయ- విదేశీయ టూర్లపై బంపర్ ఆఫర్లను ప్రకటించింది. అంతే కాకుండా ఎక్స్పోలో ముందుగా టూర్ బుక్ చేసుకున్నవారికి లక్కడిప్ ద్వారా పదిమంది విజేతలను కూడా ప్రకటించి ఉచిత టూర్లను అందించనున్నట్లు రమణ తెలిపారు. కష్టమర్ల కోసం సరికొత్త డిజైన్ చేసిన దేశీయ టూర్ ప్యాకేజీల పై 10% తగ్గింపు, అంతర్జాతీయ టూర్ ప్యాకేజిలపై 5% భారీ డిస్కౌంట" కల్పిస్తుందన్నారు. లక్కీ డిప్ విజేతలకు మొదటి బహుమతి యూరప్ టూర్, రెండవ బహుమతి దుబాయ్ టూర్, మూడవ బహుమతి శ్రీలంక టూర్ నాలుగవ బహుమతి బ్యాంకాక్ టూర్, ఐదవ బహుమతి శ్రీనగర్ టూర్ ఆరవ బహుమతి చార్ధామ్ టూర్, ఏడవ బహుమతి తమిళనాడు టూర్, ఎనిమిదవ బహుమతి కర్ణాటక టూర్, తొమ్మిదవ బహుమతి ఒరిస్సా టూర్ పదవ బహుమతి కాశి, అయోధ్య టూర్లను బహుమతిగా అందించనున్నట్లు పేర్కొన్నారు. 2025 లో వచ్చే మహా కుంభమేళా, సరస్వతి పుష్కరాలను యాత్రికులు సౌకర్యవంతంగా చేసుకునేలా అద్భుత ఏర్పాట్లతో అందరికి అందుబాటులో ఉండే ధరలలో టూర్ ప్యాకేజిలను సిద్ధం చేశామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. దేశంలో ఎవ్వరు ఇవ్వలేని విధంగా... సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండేలా... ప్రతి ఒక్కరు కాశీ -అయోధ్య యాత్ర దర్శన భాగ్యాన్ని పొందాలనే సదుద్దేశంతో ఈ ఎక్స్పో లో స్పెషల్ డిస్కౌంట్ ఆఫర్లను కల్పిస్తున్నామని తెలిపారు. కాశి- అయోధ్య మూడు రాత్రులు, 4 డేస్ యాత్ర కేవలం 19,999 రూపాయలకి విమానంలో వెళ్లి వచ్చేలా అలాగే దేశీయ టూర్ బడ్జెట్లో విదేశీ టూర్ ను అందించాలన్న సంకల్పంలో బ్యాంకాక్ - విట్టాయ నాలుగు నైట్స్" 5 డేస్ టూర్ కేవలం 13,999 రూపాయలకి మాత్రమే అందించనున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్పో కు ప్రతి ఒక్కరు విచ్చేసి ఈ అద్భుత అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధినేత ఆర్.వి రమణ కోరారు.

## రామన్నపేట నిరవధిక సమ్మె

## పెంచిన అమాలి కూలి రేట్ల జీవో ను వెంటనే విడుదల చేయాలి

- సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ
- A ITUC జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగి నరసింహ

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 2**
సివిల్ సప్లై అమాలి కార్పొరేషన్లు పనిచేస్తున్న అమ్మాలి కార్మికులకు పెంచిన కూలీ రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సివిల్ సప్లై హమాలీలు తమ ఎగుమతి దిగుమతులను పనులను నిలిపివేశారు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈరోజు రామన్నపేట సివిల్ సప్లై గోదాం వద్ద నిరవద్దక సమ్మెకు సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, అమాలి కార్మికులకు మద్దతు తెలుపి మాట్లాడుతూ అమాలి స్వీపర్లకు కార్మికులకు రెండు సంవత్సరాలకు ఒకేసారి కూలీ రేట్లు పెంచారు గత ప్రభుత్వం జీ ,వో విడుదల చేసిందని దాని ప్రకారం జనవరి 20, 24 సంవత్సరం నుండి నూతన రేట్లు ఇవ్వవలసి ఉందని అన్నారు. ఈ విషయం గత అక్టోబర్ లో సివిల్ సప్లై కమిషనర్ సమక్షంలో చర్యలు జరిపి రేట్లు పెంచుటకు ఒప్పందం జరిగింది. మూడు నెలలు పూర్తి కావస్తున్న నేటికీ ఒప్పందాన్ని అమలు చేయనందుకు సమ్మె అని వ్యార్యమైందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మోత్కూరు చౌటుప్పల్ రామన్నపేట ఆలేరు గోడౌన్ లోను సుమారు 100 మందికి పైగా అమాలి స్వీపర్లు కుడా పనిచేస్తున్నారు. అమాలి సమ్మెతో రేషన్ బియ్యం గోదాములకే పరిమితమయ్యాయని, తక్షణమే ప్రభుత్వం సందర్శించి జీవోను విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో A ituc మండల నాయకుడు శివరాత్రి సమ్మయ్య, బండ స్వామి, తోటకూర అంజయ్య, మోటి నగేష్ ఏనుగ అచ్చాలు గొరిగి రవి, పెంటయ్య, మోటి వెంకటేష్, ఉప్పలయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





- గత ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా అమ్యామ్యాలకు ఆశపడి అనుమతులు
- ప్రభుత్వ భూముల్లోనే కట్టి.. ప్రభుత్వం ద్వారానే ఆదాయం పొందుతున్న స్ప్రింగ్ ఎనర్జీ కంపెనీ
- బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు, ఏర్పాట్లు ఉండవద్దని చెబుతున్న నిబంధనలు
- గ్రీన్ ఎనర్జీ పేరుతో అడ్డగోలుగా నిబంధనల ఉల్లంఘన
- బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

# పట్టణాలే కాదు... పల్లె చెరువులను కూడా కాపాడండి







**అడ్డాకుల మండలం వెలుతురు జనవరి 02:**
ప్రభుత్వ భూముల్లోనే కట్టి.. ప్రభుత్వం ద్వారానే ఆదాయం పొందుతున్న స్ప్రింగ్ ఎనర్జీ సోలార్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామ సమీపంలో స్ప్రింగ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ఊర చెరువులో అక్రమంగా నిర్మించిన సోలార్ ప్లాంటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అమ్యామ్యాలకు ఆశపడి కంపెనీలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారన్నారు. బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు, ఏర్పాట్లు ఉండవద్దని నిబంధనలు ఉన్నప్పటికి గ్రీన్ ఎనర్జీ పేరుతో అడ్డగోలుగా నిబంధనల ఉల్లంఘన జరిగిందన్నారు.. రాష్ట్రంలో చెరువులు, కుంటలు కాపాడాలని ముఖ్యమంత్రి గారు కృతనిశ్చయంతో వున్నారని, ఓవైపు హైదరాబాద్ పరిధిలో హైడ్రా ఏర్పాటు చేసి బఫర్ జొన్లలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తుంటే...జిల్లాలోని అధికారులు మాత్రం ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా చెరువులను ఆక్రమించిన కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు అధికారులను తీసుకుని ఇక్కడకు వచ్చి అక్రమంగా నిర్మించిన సోలార్ ప్లాంట్లను పరిశీలించి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాధు చేస్తామని, అవసరమైతే రైతుల తరఫున గ్రీన్ ట్రిబ్యునల్ లో కూడా ఫిర్యాధు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి వనపర్తి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, నాయకులు వివి గౌడ్, అంజన్న యాదవ్,మహేందర్ నాయుడు,రాఘవేందర్ గౌడ్, రమేష్ సాగర్, దేవర శివ, గౌతమ్ శంకర్, నరసింహా యాదవ్, మహమ్మద్, వసంత్ చారి తదితరులు పాల్గొన్నారు

# కోర్టుకు హాజరైన అఖిల పక్ష నాయకులు

## భవిష్యత్తు లో గ్రామంలోని ప్రభుత్వ భూములను కాపాడుకోవడమే లక్ష్యంగా ఉద్యమం




**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 02:**
సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని మసీదు పక్కన ఉన్న అంగడి స్థలం గుత్తా ప్రేమ్చందర్ రెడ్డి అక్రమ పట్టా చేసుకున్నరని దానికోసం పోరాటం చేస్తుంటే అక్రమంగా కేసులు పెట్టి కోర్టుల చూట్టు తిప్పుతున్నారు. గ్రామా పంచాయితీ స్థలాలను, కందకాలు స్థలాన్ని కాపాడుకోవడం కోసమే అఖిల పక్షం నాయకుల ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం అని తెలిపారు.ఫలితంగా అక్రమార్కులు కేసు పెడితే న్యాయం కోసం కోర్టు ల చూట్టు తిరుగుతున్నాం. సంస్థాన్ నారాయణపురం గ్రామా పంచాయితీ పరిధిలో ప్రభుత్వం భూమి చాలా తక్కువగా ఉన్నది. ఉన్న ప్రభుత్వ భూములను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి గ్రామా పౌరుడి పైన ఉన్నది అని ఈ సందర్భంగా తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే (స్థానికేతర) వ్యక్తులు రాజ్యాగ పదవుల్లో గెలుపొంది. గ్రామాలలోని ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ పంచాయితీ అధికారుల తో గ్రామాలలోని పోరంబోకు భూములు గ్రామ కంటాలు, కందకాలకు రిజిస్ట్రేషన్ కోసం అనుమతి పత్రాలను పొందుతున్నారు.గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకుల పై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయకపోతే కొద్దికాలంలో రిలే నిరాహార దీక్షలు నడి చౌరస్తాలో పెడతాము. భవిష్యత్ లో గ్రామా ప్రజలందరినీ మమేకం చేసి పోరాడతాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వలిగొండ యాదయ్య,మందుగుల బాలకృష్ణ, చిలివేరు అంజయ్య,ఏర్పుల అంజమ్మ,సూరపల్లి శివాజీ,మద్ది సంజీవ,చిలివేరు భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాల్సిన బాధ్యత మాది మా ప్రభుత్వానిది

- మేము అన్ని సమకూరుస్తాం మీరు బాగా చదువుకోవాలి
- ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వంట చేసే పాత్రల్ని మార్చాలి
- అన్ని గురుకులాలలో టీచింగ్ స్టాఫ్, హాస్టల్ స్టాఫ్, ప్రత్యేకంగా వేరువేరుగా ఉండాలి
- టీచింగ్ స్టాఫ్ కే హాస్టల్ నిర్వహణ బాధ్యతలు చెప్పడం వల్ల విద్యార్థులకు సరైన బోధన అందడం లేదు
- గురుకుల పాఠశాల సందర్శన సందర్భంగా కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి







**చండూరు మండలం వెలుతురు జనవరి 02:**
మునుగోడు నియోజకవర్గం లోని చండూరు బోడంగిపర్తి గ్రామంలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి పాఠశాలను, తరగతి గదులను, స్టోర్ రూమ్ను, వంటగదిని, బాత్రూంలను, డ్రైనేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లాస్ రూమ్ లో విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు.. విద్యార్థులు ఏఏ ప్రాంతాల నుండి వచ్చి చదువుకుంటున్నారు అని ఆరా తీశారు. భోజనం లోకి ఎటువంటి కూరగాయలు వాడుతున్నారు నూనె ఏ కంపెనీ వాడుతున్నారు అనే విషయాలు క్షుణ్ణంగా పరిశీలించారు. వంటగదిలోకి వెళ్లి వండిన అన్నం, కూర, సాంబారు, పెరుగును పరిశీలించారు. పాఠశాల భవనంలో విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా కొన్ని మార్పులు సూచనలు చేశారు. విద్యార్థులు చన్నీళ్లతో స్నానం చేస్తున్న విషయాన్ని అధ్యాపకులు గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలోనే సోలార్ హీటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.. ఐదవ తరగతి నుండి అమ్మ నాన్నలను వదిలిపెట్టి ఇంత దూరం వచ్చి చదువుకుంటున్న మీకు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన భోజనం అందించడం మాపైన మా ప్రభుత్వం పైన ఉందని అన్నారు... తప్పకుండా రాబోయే రోజుల్లో బోడంగిపర్తి పాఠశాల లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తానని.. మీరందరూ బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు...

## కొండగడప శివరాం మృతదేవానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 2**
మండలం కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన కొండగడప శివరాం ఆత్మహత్య చేసుకొని మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గ్రామంలోని ఇంటి వద్దకు వెళ్లి పార్థివ దేవానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం. మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్. బాలగోని నరసింహ, ఎండి అమీర్. జిల్లా నాయకులు ఎస్కే చాంద్. పట్టణ కార్యదర్శి జడ సంతోష్. నాయకులు ఆవుల శ్రీధర్, బొడ్డు ఆల్లయ్య, నోముల లింగస్వామి, కొండగడప చింటూ తదితరులు పాల్గొనడం జరిగింది.

## మునుగోడు నియోజకవర్గం లో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఊరుకునేది లేదు

- నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని కబ్జా చేసే వారిని ఎవరిని వదిలిపెట్టం
- రాజ్ గోపాల్ రెడ్డి చుట్టమైన ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు తీసుకోండి
- ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి ఫోన్
- అన్ని మండల కేంద్రాలలో భూకబ్జాలపై స్పెషల్ డ్రైవ్ పెట్టండి
- రెవిన్యూ అధికారుల సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**చండూర్ వెలుతురు జనవరి 02:**
మునుగోడు నియోజకవర్గం లో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మండల కేంద్రాలలో ప్రభుత్వ కార్యాలయాన్ని ఒకే చోట నిర్మించేలా, విద్యా సంస్థలన్నీ %ఖఎస్త్రఱ% ఒకే ప్రాంగణంలో ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని... ఆయా మండల కేంద్రాలలో ఎంత ప్రభుత్వం భూమి ఉన్నదో సర్వే చేసి పొజిషన్ తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, దొంగ పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూములు కబ్జా చేశారని, వాటిని గుర్తించి రికవరీ చేయాలని అవసరమైతే వారిపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఇప్పటినుండి ఏ ఒక్కరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఊరుకునేది లేదని కబ్జా చేసేవారు మా పార్టీవారైనా చివరికి నా చుట్టమైన వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు ఎమ్మార్వో ఎం నరేందర్, చండూరు మున్సిపల్ కమిషనర్ లు అధికారులు పాల్గొన్నారు.

## ధ్వంసం అయిన డ్రైనేజ్ వ్యవస్థ ను పరిశీలించిన కార్పొరేటర్



**వెలుతురు ,హయత్ నగర్, జనవరి 2:**
మార్నింగ్ వాక్ లో భాగంగా హయత్ నగర్ డివిజన్ లోని పలు కాలనీలో గురువారం నాడు స్థానికి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పర్యటించారు, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మార్నింగ్ వాక్ లో భాగంగా కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్ లోని రాఘవేంద్ర కాలనీ ఫేస్-2 ,సాయి పద్మావతి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు భారీ వాహనాలు వెళ్లడం వల్ల భూగర్భ డ్రైనేజ్ మాన్ హెూల్స్ ధ్వంసమైనవని తెలపడంతో మాన్ హెూల్ పరిశీలించిన కార్పొరేటర్ జీవన్ రెడ్డి వెంటనే మరమ్మత్తులు జరిపించాలని సంబంధిత జలమండలి సిబ్బందికి చరవాణి ద్వారా తెలపడం జరిగింది. దీంతో అధికారులు స్పందించి చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించగలమని తెలిపారు,ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుడాల సంతోష్ ,కాలనీవాసులు శంకర్ ,గుడాల లక్ష్మీనారాయణ , గుడాల శేఖర్ మరియు కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె

**హైదరాబాద్, జనవరి 2 ( వెలుతురు):**
రాష్ట్రంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉపాధ్యాయుల సమ్మె కొనసాగుతోంది. 24వ రోజు ఉద్యోగులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ట్వీట్లను ఫ్లెక్సీ కొట్టించి నిరసన తెలిపారు. ఇక సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రుల ఫొటోలను ఫేస్ మాస్కులుగా ధరించిన నిరసన వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆయా జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులు భారీ ర్యాలీ తీశారు. కలెక్టరేట్ల ఎదుట ఎస్ఎస్ఏ ఉపాధ్యాయుల రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. విద్యాశాఖలో ఎస్ఎస్ఏ ఉద్యోగులను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు పలు జిల్లాల్లో వంటా వార్పు కార్యక్రమం కూడా నిర్వహించారు. తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. నారాయణపేట, ఆదిలాబాద్, జనగామ, జోగులాంబ గద్వాలతో పాటు పలు జిల్లాల్లో వంటా వార్పు నిర్వహించారు.

## సావిత్రి బాయి పూలే జయంతి ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా డిక్లేర్ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

### - జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 02:** భారత దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ గౌడ్ గారికి బీసీ సమాజం తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 170 సంవత్సరాల క్రితమే విద్య యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొని ఎన్ని అడ్డంకులు ఎదురైనా బడుగు బలహీనవర్గాలకు విద్యను అందించిన చదువుల తల్లి సావిత్రి భాయి పూలే అని కొనియాడారు.

## సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన దొడ్ల వెంకటేష్ గౌడ్





**కూకట్ పల్లి జనవరి 2 వెలుతురు:** నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లను ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, రాజు గౌడ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కి 19 డివిజన్ నేతల కృతజ్ఞతలు...



**కరీంనగర్ వెలుతురు జనవరి 02:** కరీంనగర్ పట్టణం 19 డివిజన్ పరిధిలో నాయి బ్రాహ్మణ కుల సంఘ భవనం వద్ద బోర్ వేయించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కు స్థానిక నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో 19 డివిజన్ కార్పొరేటర్ ఎదుల్ల రాజశేఖర్, పొన్నాల రాము, ఎడమ సాయికృష్ణ రెడ్డి, అవదుర్తి సాయికుమార్, నాయి బ్రాహ్మణ గౌరవాధ్యక్షులు శ్రీరాముల ఎల్లయ్య, సవనపెల్లి ఆనందం, ముత్యాల లక్ష్మన్, గుంజపడుగు మురళీకృష్ణ, తూముల రవి దొంతి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 02:** రెడ్డి సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు రెడ్డి సంఘం నాయకులు బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

# కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.
- మీ అండగా మా ప్రభుత్వం నిలుస్తోంది..
- చదువుతోపాటు సమాజం పట్ల అవగాహన కల్పించాలి..
- కాస్మోటిక్, మెస్ చార్జీలను పెంచిన ఘనత మా ప్రభుత్వానిది.
- మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే.









**మునుగోడు వెలుతురు జనవరి 02:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అవరోదించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను సందర్శించి తరగతి గదులను, వంటగదులను, విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు 200% మిస్ చార్జీలు 40% పెంచిన ఘనత మా ప్రభుత్వాన్నిదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనలో గురుకులాలలో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వానికి నా తరపున సూచనలు తెలియజేస్తానని, అదనపు తరగతి గదుల ఏర్పాటుకై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతోనే తోటి విద్యార్థులకు భోజనం పంపిణీ చేయించాలన్నారు. ఇక నుండి ప్రతి ప్రభుత్వ గురుకులాలను 15 రోజులకు ఒకసారి ఐఏఎస్ స్థాయి ఉన్నతాధికారులు సందర్శిస్తారన్నారు. ఆయన వెంట ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినీలు తదితరులు ఉన్నారు.

## నూతన ఫార్మేషన్ రోడ్డు ను శంకుస్థాపన చేసిన ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి



**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 2 :** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ పరిధిలోని చాంద్ ఖాన్ పల్లి లోని హన్మారెడ్డి సమాధి వద్ద నుండి కంగ్టి రొడ్డును కలిపే బైపాస్ రోడ్డు ను శంకుస్థాపన చేసిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం వలన నారాయణఖేడ్ పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది మరియు ఈ రోడ్డు నిర్మాణం వలన నారాయణఖేడ్ పట్టణంలో చాలావరకు ట్రాఫిక్ సమస్య లేకుండా మరియు ప్రయాణికులకు కూడా ఏలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఉంటాయి అని ఎమ్మెల్యే అన్నారు అలాగే నారాయణఖేడ్ పట్టణంలో గత కొద్ది రోజుల క్రితమే టి యు ఐ ఎఫ్ డి సి ద్వారా 20 కోట్ల నిధులతో డ్రైనేజీ కాలువలు మరియు సిసి రోడ్ల నిర్మాణ కోసం శంకుస్థాపన చేసి పనులను కూడా ప్రారంభించడం జరిగిందని వారు అన్నారు నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప షెట్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మరియు హనుమాండ్లు, రాజేష్ చౌహన్, రామకృష్ణ, వివేకానంద, సద్దాం, సయ్యద్, నర్సింలు, మరియు తాహెర్ మండలాధ్యక్షులు, వినోద్ పాటిల్,రమేష్ చౌహాన్,పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, జ్ఞానేశ్వర్, మరియు నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువల సీసీ రోడ్డు నిర్మాణం పనుల నాణ్యతను పరిశీలించిన ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి





**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 02 :** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ పరిధిలోని 3 వ వార్డులో ఈరోజు డ్రైనేజీ కాలువల మరియు సీసీ రోడ్డు నిర్మాణం పనుల నాణ్యతను పరిశీలించిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల మరియు సీసీ రోడ్డు నిర్మాణంలో క్వాలిటీ మెయింటెయిన్ చేయాలి అని నాణ్యతలో ఏలాంటి లోపం ఉండొద్దని నాణ్యమైన సిమెంట్ మరియు ఇసుకను వడలని ఎమ్మెల్యే అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప షెట్కర్,వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, రాజేష్ చౌహాన్, మాజిద్, హనుమండ్లు, కౌన్సిలర్లు, మరియు వినోద్ పాటిల్, రమేష్ చౌహాన్,పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ,శ్రీనివాస్ రెడ్డి ఎన్ ఎస్ యు ఎల్, శ్రీకాంత్,శంకర్ నాయక్, సల్ల ఒద్దీన్,కిషన్ నాయక్,జమున్సిపల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి

# చెక్కుల పంపిణీ...







**జహీరాబాద్ వెలుతురు జనవరి 02:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావు ఆదేశాలమేరకు జహీరాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకుమెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నామ రవికిరణ్, మహమ్మద్ యాకూబ్, బండి మోహన్ నాయకులు పంపిణీ చేశారు. ఈ రోజు చెక్కులు అందుకొన్న వారిలో 1.మినాజ్ ఫాతిమా, నేతాజీ నగర్ అల్లిపూర్ 60,000లు, 2. అఫ్రీన్ బేగం, ఎస్బిహెచ్ కాలనీ, అల్లీపూర్ 52,000లు, 3.మహమ్మద్ ఇంతియాజ్,సుభాష్ గంజ్ 18000లు యున్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే మాణిక్ రాకు, స్థానిక బిఆర్ఎస్ నాయకులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు తులసీదాస్ గుప్తా, శివప్ప ఎర్రోళ్ల, నసీర్, అప్పి రాజ్, ప్రవీణ్ చింటూ పాల్గొన్నారు.

## రాష్ట్ర మహిళా ప్రతిభా పురస్కార్ అవార్డ్ కి ఎంపికైన జ్యోతి పండాల్...

● ఈ నెల 3న ప్రముఖుల చేతుల మీదుగా అవార్డ్ ప్రదానం...

**జహీరాబాద్ వెలుతురు జనవరి 02:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతానికి చెందిన జ్యోతి పండాల్ కు ఈ నెల 3న శుక్రవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతి సిటీ కల్చరల్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్రం చేత గుర్తింపు పొందిన రాష్ట్ర బిసి ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే 194వ శ్రీ మతి సావిత్రి భాయ్ పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రముఖులచే అవార్డు ను అందించడం జరుగుతుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. జ్యోతి పండాల్ చేస్తున్న నిరంతర సేవలను గుర్తించి అవార్డును ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృద్ధులకు, మహిళలకు, వితంతువులకు, అన్ని వర్గాల ప్రజలకు ప్రజాప్రతినిధురాలిగా సేవా జ్యోతి పండాల్ కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా జహీరాబాద్ నియోజకవర్గంలో చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి మద్దతుగా పని చేశారన్నారు. జ్యోతి పండాల్ చారిటబుల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. సామాజిక సేవతో పాటు పలు సంఘాలకు బాధ్యులుగా వ్యవహరిస్తున్నందుకు గాను జ్యోతి పండాల్ ను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.

## కార్మికులకు న్యాయం చేయాలి

- సీపీఐ జిల్లా సభ్యుడు గాలయ్య



**వెలుతురు, చౌటుప్పల్, జనవరి 2:**
చౌటుప్పల్ మున్సిపల్ సివిల్ సప్లయి కార్పొరేషన్ లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పెంచిన కూలీ రెట్ల జి. ఓ ను వెంటనే విడుదల చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ముందు కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. కార్మికులకు పెంచిన కూలీ రేట్ల పెంపు జి ఓ వెంటనే అమల్లోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని గాలయ్య డిమాండ్ చేశారు, కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, అలాగే కార్మికులకు, స్వీపర్ల కార్మికులకు 10 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు, అలాగే క్వింటాల్ కు 26 రూపాయల నుండి 29 కి పెంచిన రేట్లను 1-1%-%2024 నుండి అమలు చేయడం తోపాటు ఏయి యర్స్ తో కలిపి ప్రభుత్వం ఇవ్వాలని గాలయ్య డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ ను కలిసిన ఎమ్మెల్యే దానం, లీడర్ రామన్ గౌడ్ లు



**వెలుతురు, హైదరాబాద్, జనవరి 2:**
నూతన సంవత్సరం సందర్భంగా గురు వారం ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పుడు ప్రజల మధ్యలో ఉంటూ డెవలప్మెంట్ యాక్టివిటీస్ లో పాల్గొంటూ ఉండాలని సూచించినట్లుగా చెప్పారని రామన్ గౌడ్ తెలిపారు ,?

## చెత్త ను కాల్చవద్దు

### పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్

**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, జనవరి 2:**



చెత్త ను కాల్చు వద్దని అనే అంశంపై గురు వారం నాడు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పోస్టర్ల ను ఆవిష్కరించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్త ను కాల్చడం ద్వారా కాలుష్యం ఏర్పడి ప్రజలకు హాని జరుగుతుందని తెలిపారు, అలాగే ప్రజలకు వాయు , ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయని కలెక్టర్ హెచ్చరించారు, అలాగే చెత్త సేకరణ ను కూడా తడి పొడి చెత్తగా వేరు చేయాలని సూచించారు, చెత్త ను రీసైక్లింగ్ చేయడం ద్వారా కంపోస్ట్ ను తయారు చేయడం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు నాగేశ్వర్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు ,

## గ్రీన్ కో -ప్రీమియర్ పుటో వాల్టెక్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆట సామగ్రి పంపిణీ..

● పాల్గొన్న కోహిర్ మండల విద్యాధికారి జాకీర్ హుస్సేన్...

**జహీరాబాద్ వెలుతురు జనవరి 02:**
సేవభావంతో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేసి వారికి ఆటల్లో మరింత రాటుదేల్చేందుకు గ్రీన్ కో -ప్రీమియర్ పుటో వాల్టెక్ కంపెనీ దిగ్వాల్ వారు సీఎస్ఆర్ నిధులతో గురువారం నాడు కోహిర్ మండల విద్యాధికారి జాకిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో గ్రీన్ కో ఫౌండేషన్ వారి ప్రీమియిర్ పుటో వాల్టెక్ కంపెనీ మేనేజర్స్ బాష, మధుప్రియ, అసిస్టెంట్ మేనేజర్స్ జగదీశ్ కుమార్, ఉదయ్ కుమార్ డిప్యూటీ మేనేజర్ శివకిషోర్ మొదలగు అధికారులు దిగ్వాల్ ఉన్నత పాఠశాలలో సుమారు యాభైవేయిల రూపాయలతో స్పోర్ట్స్ కిట్స్ (క్రికెట్, వాలీబాల్, షటిల్, క్యారంమ్స్, స్కిప్పింగ్,) ఇతర ఆట వస్తువులతో పాటు ఛార్జింగ్ స్పీకర్ సెట్ ని పాఠశాలకి అందించారు. ఈ సందర్భంగా మధుప్రియ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు ఆటవస్తువుల ద్వారా చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించి పాఠశాలకి గొప్ప పేరు తీసుకు రావాలని కోరి సీఎస్ఆర్ ఫండ్స్ కింద ఇంకా ఇతర అభివృద్ధి పనులు దిగ్వాల్ ఉన్నత పాఠశాలకు చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం కోహిర్ మండల విద్యాధికారి జాకిర్ హుస్సేన్ మాట్లాడుతూ పాఠశాలకు ఇలాంటి స్పోర్ట్స్ కిట్స్ స్పీకర్ సెట్ డొనేట్ చేయడం చాలా గొప్ప విషయం అని తెలిపి వారు ఇచ్చిన వస్తువులు జాగ్రత్తగా వాడుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రీన్ ఫౌండేషన్-ప్రీమియర్ పుటో వల్టెక్ అధికారులని, సిబ్బందిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించి వారికీ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ ఎం రవీందర్, ఉపాధ్యాయులు రాంచందర్ భీం వంశీ, శ్రీనివాస్, కవిత వెంకటేష్, శ్రీనివాస్ విజయలక్ష్మి, అశ్విని, చంద్రశేఖర్, లలిత, ఆనంద్, కవిత ఇఫ్తాకర్, ఆరిఫ్, బద్రోద్దీన్, ముజీబ్, వసుధ, మాధవి, విజయలక్ష్మి, ఉమాదేవి భార్గవి, డా వసంత రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్సీ కవిత వీటికి జవాబు చెప్పి ధర్నా చేయాలి

## ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 2:**
10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బీసీలను వంచించడమే కాకుండా, వారికి న్యాయంగా అందాల్సిన నిధులను ఏ ఒక్క సంవత్సరంలో కూడా ఖర్చు చేయకుండా వారిని నిట్టనిలువునా ముంచిందని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు, ఇప్పుడు అధికారం పోయిన తర్వాత బీసీలపై కపట ప్రేమ చూపుతూ కల్వకుంట్ల కుటుంబం వారిపై మొసలికన్నీరు కారుస్తోందన్నారు, బీసీలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలదు. అధికారం పోయిన తర్వాత బీఆర్ఎస్ కు బీసీలు గుర్తుకొచ్చారని అన్నారు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసి వారి గొంతు కోసింది బీఆర్ఎస్ అని మహేష్ గౌడ్ అన్నారు, లిక్కర్ స్కాంలో మరకంటించుకున్న ఎమ్మెల్సీ కవిత దాన్ని పోగొట్టుకోవడంతో పాటు బీఆర్ఎస్ పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడంతో ఎటూ పాలుపోని ఆమె రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడం కోసం ఇప్పుడు బీసీల పేరిట కపట నాటకం మొదలుపెట్టారని ఆయన ఆరోపించారు,అందులో భాగంగానే ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమం. విజ్ఞులైన బీసీలు ఈ కుట్రలను గమనించి బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తరపున కోరుతున్నామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు, కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనం నన్ను తెలంగాణ అధ్యక్షులుగా నియమించడమేన్నారు,అంతేకాక రాష్ట్ర క్యాబినెట్లో బీసీలకు అధిక ప్రాధాన్యతిచ్చిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బీసీ నేతను ఏర్పాటు చేయడం సాధ్యపడుతుందా? అని ప్రశ్నించారు,గత మీ ప్రభుత్వ హయాంలో మంత్రులుగా బీసీలకు ఎంత ప్రాధాన్యతిచ్చారో బహిరంగ రహస్యమే. మీ పాలనలో బీసీలను అడుగడుగున అణగదొక్కిన మీరు ఇప్పుడు బీసీ జపం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందనీ బీసీల పేరుతో ధర్నా చేయాలని నిర్ణయించిన మీకు ఇవ్వాల్సింది పోయి ధర్నా చేపట్టడం దురదృష్టకరం. బీసీల అభివృద్ధి కోసం పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన చర్యలు, ప్రస్తుతం ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలనలో చేపట్టిన చర్యలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని నేను కవితను బీఆర్ ఎస్ నేతలను సవాలు చేస్తున్నానని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు,

టీపీసీసీ అధ్యక్షులుగా నేను కొన్ని ప్రశ్నలను సంధిస్తున్నాను. మీరు వీటికి సరైన సమాధానం చెబుతారని ఆశిస్తున్నాననీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, వారికి మరింత ప్రయోజనకరంగా ఉండేలా సలహాలు, సూచనలు

### ఆయన ప్రశ్నించినవి ఇలా ఉన్నాయి

1) కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుతమున్న రిజర్వేషన్లను 23 శాతం నుండి 42 శాతానికి పెంచడం కోసం చర్యలు తీసుకొని, అందులో భాగంగా సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్నందుకు మీరు ధర్నా చేస్తున్నారా?
2) బీసీలకు రిజర్వేషన్లు పెంచడం ద్వారా పంచాయతీలు, మున్సిపాల్టీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు ప్రాతినిథ్యం లభించే అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టినందుకు ధర్నా చేస్తున్నారా..?
3) స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు చర్యలు చేపడుతున్నందుకు ధర్నా చేస్తున్నారా?
4) స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని నిర్ధారించడానికి గాను ప్రజా ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో కమిటీని నియమించినందుకు ధర్నా చేస్తున్నారా?
5) జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగేందుకు రాష్ట్రంలో కులగణన చేపట్టినందుకు ధర్నా చేస్తున్నారా?
6) గత బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమ బడ్జెట్ను 2971.32 కోట్ల రూపాయలకు పెంచినందుకు ధర్నా చేస్తున్నారా?
7) కాంగ్రెస్ ప్రభుత్వం గీతన్నల ఆవేదనను గుర్తించి తాడి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ధర్నా చేస్తున్నారా?
8) గీతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం కాటమయ్య రక్షణ కార్మక్రమాన్ని ప్రారంభించినందుకు ధర్నా చేస్తున్నారా..?
9) బీసీ సామాజిక వర్గానికి సంబంధించి 10 సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసినందుకు ధర్నా చేస్తున్నారా?
10) ఎమ్బీసీ కార్పొరేషన్కు రూ.400 కోట్లు కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా?
11) మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లోని వివిధ విభాగాల్లో 5136 మంది ఉద్యోగులను నూతనంగా నియమించినందుకు ధర్నా చేస్తున్నారా?
12) బీసీ హాస్టళ్లకు పక్కా భవనాల నిర్మాణాల్లో భాగంగా ఇప్పటికే 20 నిర్మాణాలకు కోసం 100 కోట్ల రూపాయలను కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా?
13) గురుకులాల్లో డైట్ కాస్మోటిక్ చార్జీలు 40 శాతానికి పెంచినందుకు ధర్నా చేస్తున్నారా?
14) 28 యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ స్కూల్స్ నూతనంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నందుకు ధర్నా చేస్తున్నారా?
15) బీసీ కార్పొరేషన్ కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 73 కోట్ల రూపాయలను కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా?

## సావిత్రి బాయ్ పూలే జయంతి ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం సంతోషం

- మంత్రి పొన్నం

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 2:**
దేశ తొలి ఉపాధ్యాయురాలిగా మహిళలు చదువుకుంటేనే ఆ ఇంటికి వెలుగు అని చాటిన ధీశాలి సావిత్రి భాయ్ పులే అని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు,సావిత్రిబాయి పూలే సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా నిలబడి దేశంలో మొదటి మహిళా పాఠాలకు పునాదులు వేశారు .అత్యంత గౌరవనీయమైన మహిళా ఉపాధ్యాయుల్లో ఒకరైన సావిత్రీబాయి విద్య ద్వారా స్త్రీలు మరియు అంటరానివారి అభ్యున్నతికి తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారని ఆయన పేర్కొన్నారు,ఆ మహనీయురాలి జయంతిని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం సంతోషనీయం, ఈ కార్యక్రమంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తంచేశారు అలాగే సీఎం కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు,



(మొదటి పేజీ తరువాయి..)

## అమరావతి నిర్మాణంలో మరింతవేగం

పనులకు సంబంధించి నిధుల సమీకరణ జరిగింది. కేబినేట్‌లో కూడా రాజధాని నిర్మాణాలకు ఆమోదం లభించడంతో ఇక పనుల్లో మరింత వేగం పుంజుకోనుంది. ఈ క్రమంలో కొత్త ఏడాది తొలిరోజున పలు పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ) రుణంతో రాజధానిలో చేపట్టబోయే ఐదు పనులకు సీఆర్డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీ) వేర్వేరుగాటెండర్లు ఆహ్వానించాయి. రూ.2,323.25 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టాయి. సీఆర్డీఏ ఆధ్వర్యంలో రెండు ఎల్పీఎస్ జోన్లలో మౌలిక వసతుల కల్పన, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిల భారత సర్వీసు అధికారుల నివాస సముదాయాల్లో మిగిలిన పనులు చేసేందుకు బిడ్లను ఆహ్వానించారు. ఈ నెల 22 మధ్యాహ్నం 2 గంటల వరకు టెండర్ల దాఖలుకు అవకాశం కల్పించారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు సాంకేతిక బిడ్లను తెరవనున్నారు. వరద నియంత్రణ, ట్రంక్ ఇన్‌ఫ్రా పనుల కోసం ఏడీసీ టెండర్లు పిలిచింది. రాజధాని నగరం జోన్ 1ఏ పరిధి నెక్కల్లులోని కొంతభాగంలో ఎల్పీఎస్ లేఔట్లలో రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రెయిన్లు, విద్యుత్తు, ఇంటర్నెట్ కేబుల్ వేసేందుకు డక్టల నిర్మాణం, అవెన్యూ ఎ÷-లాంటేషన్ తదితర పనుల్ని రూ.448.32 కోట్లతో చేపట్టనున్నారు. జోన్ 1బి ప్రాంతం నెక్కల్లు, శాఖమూరులోని ఎల్పీఎస్ లేఔట్లలోని కొన్నిభాగాల్లో తాగునీటి పైపులైన్లు, పచ్చదనం అభివృద్ధి, తాగునీరు, మురుగునీరు, విద్యుత్తు తీగల కోసం డక్టల నిర్మాణ పనులు చేపడతారు. ఇందుకు రూ.588.04 కోట్లతో టెండర్లు పిలిచారు. ఎమ్మెలే, ఎమ్మెల్సీ, అఖిల భారత సర్వీసు అధికారుల నివాస సముదాయాలకు సంబంధించిన 18 టవర్లలో రూ.434.32 కోట్లతో విద్యుత్తు, ప్లంబింగ్, శానిటరీ వస్తువుల ఏర్పాటు, సెక్యూరిటీ, అగ్నిమాపక వ్యవస్థ ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. నీరుకొండ రిజర్వాయర్ వద్ద మిగిలిపోయిన వరద నియంత్రణ పనులను రూ.470.75 కోట్లతో చేపట్టనున్నారు. బిడ్ల దాఖలుకు 22 వరకు గడువు ఇచ్చారు. రాజధానిలో మిగిలిన రోడ్లు, వర్షపు నీటి మళ్లింపు డ్రెయిన్లు, పాదచారుల బాటలు, సైకిల్ ట్రాక్‌లు, పచ్చదనం అభివృద్ధి, వీధి దీపాలు తదితర పనులకు రూ.381.82 కోట్లతో టెండర్లు పిలిచారు. వీటికి ఈ నెల 23 వరకు గడువు ఇచ్చారు. ఇదే క్రమంలో గురువారం జరిగిన కేబినేట్‌లో కూడా వివిధ పనులకు సంబంధించిన కేటాయింపులకు ఆమోదం లభించింది. సిఆర్‌డిఏ పరిధిలో ఇక పనులను త్వరగా పూర్తి చేసేలా ప్రభుత్వం పూనుకుంది.

## పుస్తక పఠనంతో నిలబడే ధైర్యం వచ్చింది

రచయితగా మహోన్నతులు అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పీవీ నరసింహారావు జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. పీవీ గురించి మాట్లాడే అంత జ్ఞానం తనకు లేదని చెప్పారు. తనకు అంత జ్ఞానం వచ్చాక మాట్లాడతానని అన్నారు. పీవీ తన గ్రంధాలయం తీసుకుని ఏపీకి వద్దామనుకున్న సమయంలో ప్రధాని అయ్యారని గుర్తుచేశారు. ఢిల్లీలో పీవీకి సరిగ్గా ఖనన కార్యక్రమం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీవీకి నివాళి అర్పించడానికి ఢిల్లీలో సమాధి లేదన్నారు. లక్షల మంది ముందుకు వచ్చి ఢిల్లీలో స్మృతి వనం ఏర్పాటు చేసేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వనవాసి, అక్షర సత్యామృతం, ఏది పాపం, నానీపాల్కే వూ ది పీపుల్ ఇలా ఎన్నో పుస్తకాలు తాను చదివిన వాటిలో ఉన్నాయని తెలిపారు. .ఇక నుంచి తన ట్విట్టర్‌లో అప్పుడప్పుడు పుస్తకాలపై పోస్ట్ పెడతానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఓజి ఓజి అంటూ అభిమానుల నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఓజి అనే కన్నా శ్రీశ్రీ అంటే బాగుంటుందని పవన్ కల్యాణ్ చమత్కరించారు.శ్రీశ్రీ మహా ప్రస్థానం, విశ్వానాధ సత్యనారాయణ , ఇతర కవులు ఎన్నో వేదనలతో రచనలు చేశారని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి కృష్ణారావు రాసిన పీవీ నరసింహారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. మైండ్‌కు శిక్షణ ఇస్తాయని.. అందుకే స్టేడియంలో శారీరక ధారుడ్య తరహాలో.. మెదడు ధారుడ్యం కోసం స్టేడియం ఇవ్వాలని చెప్పానని అన్నారు.తనకు నిలబడే ధైర్యాన్ని పుస్తకాలు ఇచ్చాయని ఉద్ఘాటించారు. తనకు ఐదో తరగతి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకున్నా అని చెప్పారు. మా అమ్మ , నాన్న వల్ల పుస్తక పఠనం అలవాటు అయ్యిందని గుర్తుచేశారు. కోటి రూపాయలు ఇస్తా కానీ, ఒక మంచి పుస్తకం ఇవ్వాలంటే ఎక్కువ సార్లు ఆలోచిస్తానని అన్నారు.తన జీవితంలో పుస్తక పఠనం లేకుంటే తాను ఏమయ్యేవాడినో అనిపిస్తుంద న్నారు. తాను కోరుకున్న జీవితం పుస్తకాల్లో కనిపించిందని పవన్ కల్యాణ్ చెప్పారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోండి. మీ భవిష్యత్తు కు ఒక ధైర్యం ఇస్తుంది. యువత పుస్తకాలు కొనండి, చదవండి, చదివించండి. అధ్యాపకులకు అధికంగా జీతాలు ఉండాలి. సమాజాన్ని ప్రభావితం చేసే అధ్యాపకులకు గుర్తింపు ఉండాలి. చిరిగిన చొక్కా తొడుక్కోకానీ, ఒక మంచి పుస్తకం కొనుక్కో. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోండి. అభిమానులు అరవడం కాదు.. పుస్తకం చదవాలన్న నా పిలుపును ఆచరించాలి' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.అమృతం కురిసిన రాత్రి పుస్తకం, నేను తొలిసారిగా కొన్నాను. కొత్త పుస్తకాల సువాసన .. మట్టి వాసన లాగా చాలా బాగుంటుంది. రాజకీయాల్లో ఇంత బలంగా నిలబడ్డానంటే పుస్తక పఠనం కారణం. కథల్లో ఉన్న భావాలు, కష్టం, నష్టంపై బాగా ఆలోచనలు చేసే వాడిని. విశ్వనాథ సత్యనారాయణ రచనలు 'ఆహా ఓహో' నన్ను ఆలోచింప చేసింది. గుర్రం జాషువా 'ఫిరదౌసి' నన్ను చాలా ఆకట్టుకుంది. ఎడ్వంచర్ అంటే 'బంగారం చేయడం ఎలా' అనే పురుషోత్తం పుస్తకం చదివా. గోపీచంద్ రచనలు సమాజంలో మంచి చెడులు తెలుపుతాయి' అని పవన్ కల్యాణ్ తెలిపారు. విద్యార్థులు తెలుగు వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. ఇంగ్లీషు నేర్చుకోండి, మాతృభాష ద్వారానే పట్టు సాధ్యం. ఇంగ్లీషు వల్లే అంతా జరిగిపోదు, ఉద్యోగాలు వచ్చేయవు. మనలో సృజనాత్మకత ఉండాలంటే మాతృభాషపై పట్టు ఉండాలని అన్నారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఒక ధిక్కార స్వరమని ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు తెలిపారు. తెలుగునాట కొద్ది మందికే అలా ఉంటుందని అన్నారు. స్వాతంత్య సమరయోధుడుగా ఉన్న సీఎం, పీఎం ఎంతోకాలం తర్వాత పీవీకి దక్కిందని చెప్పుకొచ్చారు. అలాంటి ధీరత్వం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లోనే తాను చూశానని చెప్పారు. ఓడినా ...ప్రజలకోసం పవన్‌కల్యాణ్ ముందుకు నడిచారని గుర్తుచేశారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగాను ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. ఓడినవారు పవన్‌కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. అలాంటి వారు చరిత్రలో నిలిచిపోతారని కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, 'ఈనాడు' సంపాదకులు ఎం.నాగేశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక మహోత్సవం కొనసాగుతుందని వీబీఎఫ్‌ఎస్ కార్యదర్శి మనోహర్‌నాయుడు తెలిపారు. ఈ ఏడాది 270 స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.



# చిన్మోయ్ కృష్ణ దాస్‌కు దక్కని బెయిల్

- **11మంది లాయర్ల బృందం ప్రయత్నాలు విఫలం**

**ఢాకా,జనవరి2( వెలుతురు):**
దేశ ద్రోహం నేరారోపణతో బంగ్లాదేశ్‌లో అరెస్టయి జైల్లో ఉన్న హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్‌కు ఊరట లభించలేదు. ఆయన బెయిల్ పిటిషన్‌ను చటోగ్రామ్‌లోని కోర్టు తిరస్కరించింది. బెయిల్ కోసం 11 మంది లాయర్ల బృందం ప్రయత్నించినప్పటికీ అది ఫలించలేదు. బంగ్లాదేశ్ లోని చటోగ్రామ్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో 30 నిమిషాల పాటు ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. చిన్మయ్ అరెస్టు అనంతర పరిణామాలను దృష్టిలోపెట్టుకొని గురువారం న్యాయస్థానం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ప్రస్తుతానికి ఆయనకు బెయిల్ ఇవ్వలేమని కోర్టు తేల్చిచెప్పింది.బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గతేడాది నవంబరులో చిట్టగాంగ్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ బంగ్లా జాతీయజెండాను అగౌరవ పరిచారనే అభియోగాలపై 2024 నవంబరు 25న పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అనంతరం జైలుకు తరలించారు. ఆయన తరఫున వాదనలు వినిపించేందుకు ఓ న్యాయవాది ప్రయత్నించగా.. అతడిపై ఆందోళనకారులు దాడి చేశారు. మరో సీనియర్ న్యాయవాది కేసును టేకప్ చేయగా.. ఆయనపైనా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో చిన్మయ్ కేసును వాదించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు చిన్మయ్ భాగస్వామిగా ఉన్న సమ్మిళిత సనాతన జాగరణ్ జోతే అనే సంస్థ.. 11 మందితో లాయర్ల బృందాన్ని ఏర్పాటుచేసింది. హిందూ సాధువు చిన్మోయ్ కృష్ణ దాస్ బంగ్లాదేశ్‌లో నెల రోజులకు పైగా జైలులో ఉన్నారు. ఈ క్రమంలో కూడా ఆయనకు మళ్లీ షాకింగ్ న్యూస్ వచ్చింది. గురువారం చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరిపి ఆయన బెయిల్‌ను తిరస్కరించారు. దీంతో చిన్మయ్ దాస్ మరికొంత కాలం జైల్లోనే ఉండాల్సి ఉంటుంది. బెయిల్ విచారణ సమయంలో 11 మంది న్యాయవాదులతో కూడిన బెంచ్ విచారణలో పాల్గొన్నా కూడా, చిన్మోయ్ కృష్ణ దాస్‌కు బెయిల్ లభించలేదు. అంతకుముందు డిసెంబర్ 11న బంగ్లాదేశ్ కోర్టు దాస్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విధానపరమైన లోపాల కారణంగా తిరస్కరించింది. ఇది చాలా బాధాకరమైన వార్త అని కోల్‌కతా ఇస్కాన్ వీపీ రాధా రామన్ అన్నారు. ప్రపంచం మొత్తం దీన్ని గమనిస్తోందన్నారు. కొత్త సంవత్సరంలో చిన్మయ్ ప్రభుకి స్వేచ్ఛ లభిస్తుందని అందరూ ఆశించారని పేర్కొన్నారు. అయితే 42 రోజుల తర్వాత కూడా ఈరోజు విచారణలో ఆయన బెయిల్ తిరస్కరించబడింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆయనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.చిన్మోయ్ కృష్ణ దాస్‌పై బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచినట్లు ఆరోపణలు పెడుతూ దేశద్రోహం కేసు నమోదు చేయబడింది. ఈ కేసులో ఆయన తరపున న్యాయవాది అపూర్బా కుమార్ భట్టాచార్జీ నేతృత్వంలో బంగ్లాదేశ్ న్యాయవాదులు వాదిస్తున్నారు. 2024 నవంబర్ 25న ఛటోగ్రామ్‌లోని హజ్రత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి చిన్మోయ్ కృష్ణ దాస్‌ను అరెస్టు చేసిన తరువాత, బంగ్లాదేశ్ న్యాయవాదుల బృందం ఈ కేసును విచారిస్తోంది. చిన్మోయ్ కృష్ణ దాస్ అరెస్టు తరువాత 2024 నవంబర్ 25న చటోగ్రామ్‌లోని న్యాయస్థానం ఆయనపై దేశద్రోహం కేసులో విచారణ ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నప్పటికీ, ఆయన తరపున న్యాయవాదులు బెయిల్ కోసం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఛాతీ నొప్పి కారణంగా న్యాయవాది చిన్మోయ్ కృష్ణ దాస్ కార్డియాలజీ విభాగంలో చేరారు. భౌతిక అస్వస్థత కారణంగా జనవరి 2న చిట్టగాంగ్ కోర్టులో దేశద్రోహం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న చిన్మోయ్ కృష్ణ విచారణకు ఆయన హాజరుకాలేదు. చిన్మయ్ దాస్ అరెస్టుపై, దాస్ బంగ్లాదేశ్ జాతీయ జెండాను అవమానించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటు న్నారని ఆయనపై వచ్చిన ఆరోపణల గురించి ఢాకా పోలీసులు తెలిపారు. చిన్మయ్ దాస్‌పై బీఎన్పీ మాజీ నేత ఫిరోజ్ ఖాన్ కూడా ఈ ఆరోపణలు చేశారు. అక్టోబర్ 25న చిట్టగాంగ్‌లో హిందూ సంఘాల ర్యాలీ జరిగిందని ఖాన్ ఆరోపించారు. అక్కడే చిన్మోయ్ దాస్, మరో 18 మంది వ్యక్తులు బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచారని అన్నారు. అయితే ఆ సమయంలో బీఎన్పీ నేతగా ఉన్న ఫిరోజ్ ఖాన్ పార్టీ ఆరోపణలు చేసిన కొద్ది రోజులకే బీఎన్‌పీ నుంచి బహిష్కరించబడ్డారు.



# ప్రయాగ్ రాజ్‌లో మొదలైన కుంభ ఏర్పాట్లు

- **అఖాడాల రాకతో సర్వత్రా సందడి వాతావరణం**

**లక్నో,జనవరి2( వెలుతురు):**
ప్రయాగరాజ్‌లో జరిగే మహాకుంభమేళాకు సంబంధించి సందడి మొదలయ్యింది.ఈ రోజుల్లో సూర్యోదయానికి ముందే నదిలో స్నానమాచరిస్తారు. స్వాతంత్యానికి ముందు వరకూ అఖాడాలు, నాగ సాధువుల ఆధ్వర్యంలోనే మహా కుంభమేళా జరిగేది..కానీ స్వాతంత్యం వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలో మహాకుంభమేళా లాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి సాధువుల పాత్ర పరిమితం అయింది. జనవరి 13 భోగి నుంచి ఫిబ్రవరి ఆఖరివారం శివరాత్రి వరకూ ప్రయాగరాజ్ లో జరిగే మహాకుంభమేళాకి దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కుంభమేళాలో సాధువులు, సన్యాసులు, అఘోరాలు, నాగ సాధువులు దర్శనమిస్తారు. వీరంతా ఆధ్యాత్మిక జీవితాన్ని సంపూర్ణం చేసుకునేందుకు భౌతిక ఆనందాలను విడిచిపెట్టి మోక్షాన్ని అన్వేషిస్తూ ఆఖరి శ్వాస వరకూ ఉండిపోతారు. మనదేశంలో ఇలాంటి వారు దాదాపు 50 లక్షల మంది వరకూ ఉన్నారని అంచనా. కుంభమేళా లాంటి అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవాల సమయంలో వీరు ఎక్కువగా కనిపిస్తారు.ప్రయాగ్ రాజ్ లో జరగనున్న మహాకుంభమేళాకి అఖాడాల సందడి మొదలైంది. వీరి ప్రవేశంతో మహాకుంభమేళా వేడుకలో మరింత భక్తిపూర్వకంగా మారింది. ఆచార్య మహామండలేశ్వర స్వామి విశ్వాత్మానంద సరస్వతి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగిన యాత్ర గజాననుడి సవారీతో ప్రయాణం ప్రారంభించారు. మొదట గజాననుడి సవారీ తర్వాత ఇతర దేవతల సవారీలు కూడా యాత్రలో చూడొచ్చు. అఖాడా లను చూసేందుకు భక్తులు భారీగా తరలిచ్చారు. 20 మందికి పైగా మహా మండలేశ్వరులు, రెండు వందల మందికి పైగా నాగ సన్యాసులు యాత్రలో పాల్గొన్నారు. యాత్ర చేస్తూ మహాకుంభమేళాకి తరలివెళు తున్న అఘోరాల ఆశీర్వాదం కోసం భక్తులు పోటీ పడ్డారు. యాత్రలో పూలతో అలంకరించిన ఈటెలు ఉన్నాయి...వీటిలో 'సూర్య ప్రకాష్' అనే ప్రత్యేక బ్లలెం ఉంటుంది..ఇది కేవలం ప్రయాగ్‌రాజ్ మహాకుంభ సమయంలో మాత్రమే అఖాడాలు ఆశ్రమం నుంచి బయటకు తీసుకొస్తారు. కుంభమేళాలో నాగ సాధువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. వీరి జీవన శైలి మిగిలిన ప్రజల కన్నా పూర్తి భిన్నంగా ఉంటుంది. సనాతన ధర్మాన్ని రక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారు. దుస్తులు, బంధాలను త్యజించి మనసుతో శరీరాన్ని శాసిస్తారు. నిరంతరం ధ్యానంలో ఉంటారు. బ్రహ్మచర్యం పాటిస్తారు. జనావాసాలకు దూరంగా ఉంటారు. అందుకే కుంభమేళా లాంటి ప్రత్యేక సమాయాల్లో గుంపులుగా తరలివచ్చే వీరిని చూసేందుకు భక్తులు పోటీపడతారు. నాగసాధువులు తమ ప్రతిజ్ఞలో భాగంగా కనీసం 12 సంవత్సరాలకు ఒకసారి కుంభమేళాలను సందర్శించాల్సి ఉంటుంది. కుంభమేళా లాంటి ఆధ్యాత్మిక ఉత్సవాల్లో సాధువులు భారీగా పాల్గొనేలా చేయడంలో అఖాడాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. సాధు సంస్థలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు, సనాతన జీవన విధానాన్ని రక్షించేందుకు ఆదిశంకరాచార్యులు ఎనిమిదో శతాబ్దంలో అఖాడాలను స్థాపించారు. ఇప్పుడు కుంభమేళాలో ఎక్కువమంది సాధువులు పాల్గొనేలా చేయడంలోనూ అఖాడాలదే కీలకపాత్ర.



# వేడెక్కిన ఢిల్లీ ఎన్నికల రాజకీయం


- **పోటాపోటీగా ఆప్, బిజెపిల పోస్టర్ల యుద్ధం**

**న్యూఢిల్లీ,జనవరి2( వెలుతురు):**
అసెంబ్లీ ఎన్నికల వేళ.. దేశ రాజధాని దిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆమ్‌ఆద్మీపార్టీ, భాజపా పోటీపడి వినూత్న ప్రచారం చేస్తున్నాయి. ఒకరి లోపాలను మరొకరు ఎత్తిచూపుతూ, హామీల వర్షం కురిపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాజపా విడుదల చేసిన పోస్టర్‌కు ఆప్ తనదైనశైలిలో కౌంటర్ ఇచ్చింది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్ ఒకే అడ్రస్‌లో వందల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని భాజపా ఎక్స్ వేదికగా ఆరోపించింది. ఇంటి యజమానికి తెలియకుండా నకిలీ ఓటర్లను రిజిస్టర్ చేస్తున్నారని దుయ్యబట్టింది. ఇది కేజ్రీవాల్ కొత్త గేమ్ అంటూ తీవ్ర విమర్శలు చేసింది. ఆప్‌నకు నకిలీ ఓటర్లపై ప్రేమ అనే అర్థం వచ్చేలా ఒక పోస్టర్‌ను షేర్ చేసింది. దీనికి ఆప్ కౌంటర్ ఇచ్చింది. ఆ విమర్శను తిప్పి కొడుతూ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) అంటూ కేజ్రీవాల్ ఉన్న ఒక పోస్టర్ వీడియోను పంచుకుంది. ఇదిలాఉంటే.. దిల్లీలో ఓటర్లకు భాజపా నగదు పంపిణీ చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈమేరకు అరవింద్ కేజ్రీవాల్ ఆరెస్సెస్ అధ్యక్షుడు మోహన్ భాగవత్‌కు లేఖ రాశారు. కమలం పార్టీ చేస్తున్న తప్పిదాలను ఆరెస్సెస్ ఆమోదిస్తుందా? అని అందులో ప్రశ్నించారు. ఈ లేఖపై భాజపా స్పందిస్తూ.. ఇలా మీడియా దృష్టిని ఆకర్షించడం కోసం ఆరెస్సెస్ అధ్యక్షుడికి లేఖ రాయడానికి బదులు ఆ సంస్థ నుంచి సేవా స్ఫూర్తిని నేర్చుకోవాలని కేజ్రీవాల్‌కు హితవు పలికింది. దేశ రాజకీయాల్లోనే ఆప్ అవిశ్వసనీయ పార్టీకి ఉదాహరణ అని, దీనిని ప్రజలు అర్థం చేసుకున్నారని భాజపా అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది ఎదురుదాడి చేశారు. అబద్దాలు చెప్పడం మానుకోవడానికి నూతన సంవత్సరం రోజున కేజ్రీవాల్ తీర్మానించుకోవాలని దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ కేజ్రీవాల్‌కు మరో లేఖ రాశారు.




## బీసీల మహిళల పక్ష పాతి రేవంత్ సర్కార్ ..

**సీఎం కు, సీతక్క కు, పొన్నం కు కృతజ్ఞతలు: ఇందిరాశోభన్**



**హైదరాబాద్ వెలుతురు జనవరి 02:**
బుధవారం మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క గారితో ఎంఎల్ ఏ పర్ణిక రెడ్డి, ఇందిరాశోభన్, బొంద్రు శోభ కలిసి సావిత్రి భాయి పూలే జయంతిని(జనవరి3) మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నను కోరగా గురువారం రోజున ప్రకటించారు. ఆడబిడ్డల తరుపున సిఎం గారికి మరియు సీతక్క గారికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి కృతజ్ఞతలు . మరొక సారి బిసి మహిళల పక్ష పాత సిఎం గా ప్రభుత్వం గా నిరూపణ అయింది. ఈ సందర్భంగా దమ్ముంటే కల్వకుంట్ల కవిత శుక్రవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేసే ముందు వారి పార్టీ అధ్యక్షుణ్ని మరియు ప్రతి పక్ష నాయకున్ని "బీసీ" ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం.కనీసం వర్కింగ్ ప్రెసిడెంట్ ను కూడా బిసి లకు ఇవ్వకుండా బిసి నినాదంతో రాజకీయ పబ్బం గడపడం మీకే సాధ్యం లిక్కరక్క ఇప్పటికే మహిళా యూనివర్సిటీ కి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నం. మీరు మా ఆత్మ గౌరవము "గడిల"తాకట్టు పెట్టుకుండ్రు ఇప్పుడు రేవంతన్న మా ఆత్మ గౌరవం కాపాడుతుండు. ఇది మా కున్న చిత్త శుద్ధి. ఇందిరాశోభన్ కాంగ్రెస్ బిసి బిడ్డ.

# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి ప్రణాళికలు

- నిర్మాణం 3.4 లక్షల చెట్లు తొలగించాలని నిర్ణయం
- 353కుటుంబాలను తరలించాల్సిక తప్పదు

**తిరువనంతపురం, జనవరి 2 ( వెలుతురు):**
శబరిమల సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు వేశారు. అయితే ఆ విమానాశ్రయం కోసం సుమారు 3.4 లక్షల చెట్లను తొలగించాల్సి ఉంటుందని కొట్టాయం జిల్లాశాఖ ఓ నివేదికను తయారు చేసింది. దీని కోసం సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నివేదికను రూపొందించారు. ఒకవేళ ఎయిర్‌పోర్టు నిర్మిస్తే సుమారు 353 కుటుంబాలను తరలించాల్సి వస్తుందని రిపోర్టులో పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 3.3 లక్షల రబ్బరు, 2492 టేకు, 2247 వైల్డ్ జాక్, 1131 జాక్‌ఫ్రూట్, 828 మహోగని, 184 మామిడి చెట్లను తొలగించాల్సి ఉంటుంది. చెట్లతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న ఏడు మతపరమైన ప్రదేశాలను మార్చాల్సి వస్తోందని రిపోర్టులో తెలిపారు. శబరిమల గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు ద్వారా 347 కుటుంబాలు నేరుగా నష్టపోనున్నారు. దీంట్లో 238 కుటుంబాలు చెరువెల్లి ఎస్టేట్‌లో పనిచేస్తున్నారు. ఇక్కడే చెరువెల్లి జాతి ఆవు కూడా కనిపిస్తుంది. ఒకవేళ ఎస్టేట్‌ను మార్చేస్తే, అప్పుడు ఆవుల పరిస్థితి దయనీయంగా ఉంటుందని రిపోర్టులో వెల్లడించారు.



శబరిమల విమానాశ్రయం కోసం 1039.876 హెక్టార్ల భూమి అవసరం ఉంటుంది. ఆ భూమిని మణిమాల, ఎరుమేలి సౌత్ గ్రామాల నుంచి సేకరించనున్నారు. శబరిమల యాత్రికులు, ఎన్‌ఆర్‌ఐలు, పర్యాటకులు, ఇతర ప్రయాణికుల ఉద్దేశంతో కేఎస్‌ఐడీసీ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. శబరిమల ఎయిర్‌పోర్టుతో ట్రావెన్‌కోర్ యాత్రా స్థలాలకు వెళ్లే మార్గాలకు దారి సులువు అవుతుంది. వావరు మసీదు, మారమన్ కన్వెన్షన్, ఎటుమన్నూర్ మహాదేవ ఆలయం లాంటి ప్రదేశాలకు యాక్సిస్ పెరుగుతుంది. స్థానికంగా ఆర్థిక వ్యవస్థ బలపడనున్నది. టూరిస్టుల సంఖ్య పెరగనున్నది. కుమరొక్కం బ్యాక్‌వాటర్స్, మున్నార్ హిల్ స్టేషన్స్, గావి ఫారెస్ట్, టెక్కడీ వైల్డ్‌లైఫ్ సాంక్చురీ, పెరియార్ టైగర్ రిజర్వ్, ఇడుక్కి డ్యామ్‌కు లింకు రోడ్డు బిజీ అవుతుంది.

## వరాహ అవతారంలో రామయ్య

**భద్రాచలం, జనవరి 2 ( వెలుతురు ):**
దక్షిణాది అయోధ్య భద్రాచలంలో వైకుంఠ ఏకాదశి అధయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రోజుకో అవతారంలో స్వామివారు దర్శనమిస్తున్నారు. ఇందులో భాగంగా మూడో రోజైన గురువారం వరాహ అవతారంలో స్వామి వారు భక్తులకు అభయమిస్తారు. మహానివేదన అనంతరం స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తారు. నృత్యాలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో విహరిస్తారు. కాగా, రెండో రోజైన బుధవారం స్వామివారు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. తొలుత స్వామివారిని మేళతాళాల నడుమ మిథిలా స్టేడియం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం కూర్మావతారంలో ఉన్న స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 9న తెప్పోత్సవం, 10న ఉత్తర ద్వార దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల సందర్భంగా జనవరి 10 వరకు ఆలయంలో నిత్య కల్యాణాలను అధికారులు నిలిపివేశారు.

## మౌలిక వసతుల కోసం మెడికల్ విద్యార్థుల ధర్నా




**కుమ్రంభీం ఆసిఫాబాద్, జనవరి 2 (వెలుతురు):**
కాంగ్రెస్ పాలనో అన్ని వర్గాల ప్రజల నుంచి నిరసన, ప్రదర్శనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆసిఫాబాద్‌లోని కళాశాలలో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం మెడికల్ కళాశాల విద్యార్థులు ధర్నా చేపట్టారు. యూనిఫామ్‌ని ధరించి కళాశాల ఎదుట బైఠాయించారు. కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు బోధించేందుకు కనీసం అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా లేని దుస్థితి నెలకొందని మెడికల్ విద్యార్థులు ఆరోపించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు సరైన హాస్టల్ వసతి కూడా లేదని, కనీసం తాగేందుకు మంచినీళ్లు కూడా హాస్టల్‌లో ఏర్పాటు చేయటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై కళాశాల ప్రిన్సిపాల్ అడిగేందుకు ప్రయత్నిస్తే విద్యార్థుల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. అక్టోబర్‌లో ప్రారంభం కావాల్సిన మెడికల్ కళాశాల తరగతులు డిసెంబర్లో ప్రారంభించి తమ రెండు నెలల కాలం వృథా చేశారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆసిఫాబాద్‌లోని మెడికల్ కళాశాలలో సరిపడా ప్రొఫెసర్లను నియమించాలని, హాస్టల్లో విద్యార్థుల కోసం కనీస వసతులైన కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## స్టీల్ ఫ్యాక్టరీలో అగ్నప్రమాదం

- ఏడుగురు కార్మికులకు గాయాలు

**తిరుపతి,జనవరి2( వెలుతురు):**
తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో బుదవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పరిశ్రమలోని ఫర్నేస్ బాయిలర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద శబ్దంతో బాయిలర్ పేలిపోయింది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని నాయుడుపేట, నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, స్టీల్‌ప్లాంట్‌లో రాత్రి షిఫ్టులో 50 నుంచి 70 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. వీరంతా బీహార్‌వాసులేనని స్థానికులు చెబుతున్నారు. యాజమాన్యం వివరాలు చెప్పకుండా గోప్యత పాటిస్తుండటంతో అంతా అయోమయం నెలకొంది.

## అసదుద్దీన్ పిటిషన్ విచారణకు సుప్రీం ఒకే

**న్యూఢిల్లీ,జనవరి 2 ( వెలుతురు):**
1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ఇవాళ అంగీకారం తెలిపింది. 1947, ఆగస్టు 15వ తేదీ నాడు మతపరమైన స్థలాల అంశంలో ఎటువంటి చట్టం అమలులో ఉందో, అదే తరహా విధానాన్ని మెయిన్‌టేన్ చేయాలని ఆ పిటీషన్‌లో కోరారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టింది. ప్రార్థనా స్థలాలకు చెందిన కేసులతో లింకున్న వాటికి అసద్ పిటీషన్‌ను జోడించాలని సుప్రీం ఆదేశించింది. ఫిబ్రవరి 17వ తేదీ ఆ పిటీషన్‌పై విచారణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎంపీ అసదుద్దీన్ తరపున అడ్వకేట్ నిజాం పాషా వాదించారు.

## మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ ముస్తాబు

**న్యూఢిల్లీ, జనవరి 2 ( వెలుతురు):**
జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ఈ కుంభమేళాకు బాంబు బెదిరింపులు రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఓ ఎక్స్ యూజర్ ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. మతపరమైన ఈ కార్యక్రమానికి హాజరయ్యే కనీసం 1,000 మందిని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన యూపీ పోలీసులు సదరు ఎక్స్ యూజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. కాగా, మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్‌ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

## అందుకే ఆ దేవుడ్ని ప్రార్థించా


### - అజిత్ పవార్ తల్లి

**ముంబై,జనవరి 2 ( వెలుతురు):**
మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తల్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, తన కుమారుడు మళ్లీ కలవాలని దేవుడ్ని ప్రార్థించినట్లు తెలిపారు. తన ప్రార్థనలు ఫలిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కొత్త ఏడాది తొలి రోజైన బుధవారం అజిత్ పవార్ తల్లి ఆశా–తాయ్ పవార్, పంఢర్‌పూర్‌లోని ప్రసిద్ధ విఠల్, రుక్మిణీ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు, విడిపోయిన శరద్ పవార్ మధ్య మళ్లీ సయోధ్య కుదరాలని విఠల్ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. 'పవార్ కుటుంబంలో ఉన్న మనస్తాపాలన్నీ తొలగిపోవాలని నేను ప్రార్థించా. అజిత్, శరద్ పవార్ మళ్లీ కలవాలని నేను ప్రార్థించా. నా ప్రార్థనలు ఫలిస్తాయని ఆశిస్తున్నా' అని అన్నారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన తర్వాత అజిత్ పవార్



నేతృత్వంలోని ఎన్సీపీ, ప్రత్యర్థి శరద్ పవార్ వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శరద్ పవార్‌తో తన కుమారుడు మళ్లీ కలవాలని అజిత్ పవార్ తల్లి ఆశా–తాయ్ పవార్ బహిరంగంగా ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఎన్సీపీలో కీలక నేత ప్రఫుల్ పటేల్ కూడా దీనిపై స్పందించారు. 'శరద్ పవార్ మాకు దేవుడు లాంటివారు. పవార్ కుటుంబం ఏకమైతే నేను చాలా సంతోషిస్తా' అని మీడియాతో అన్నారు.

## 132 గంటలు రద్దీ వల్ల రోడ్లపైనే వాహనాలు



**న్యూఢిల్లీ, జనవరి 2 వెలుతురు):**
మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తొచ్చేది కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగరమే. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే అగ్రస్థానం. ఇప్పుడు ట్రాఫిక్ జామ్ పరంగా ఆసియాలోనే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు మొదటిస్థానంలో నిలిచింది. టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 ప్రకారం.. ఆసియాలోనే అత్యంత రద్దీగా ఉండే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు తొలి స్థానంలో నిలిచింది. ఇక్కడ పీక్ అవర్స్‌లో కేవలం 10 కిలోమీటర్ల దూరానికే ఏకంగా 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. అంటే ఈ టెక్‌హబ్‌లోని నివాసితులు ఏటా దాదాపు 132 గంటలపాటు ట్రాఫిక్ జామ్‌లోనే చిక్కుకుపోతారు. అందుకు కారణంగా బెంగళూరులో రద్దీకి తోడు నగరం వేగంగా విస్తరిస్తుండటమే. దక్షిణ, ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా బెంగళూరుకే వెళుతుంటారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే నివసిస్తుంటారు. దీంతో పట్టణం కూడా బాగా విస్తరిస్తోంది. మరోవైపు ఈ సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రావడం లేదు. నగర రోడ్లలో ప్రయాణం నరకయాతంగా మారిపోయింది. ఇక పీక్స్ అవర్స్, హాలిడేస్‌లో ట్రాఫిక్‌ను తప్పించుకోవడం పెద్ద టాస్క్‌గా మారింది. ఇక ఈ జాబితాలో బెంగళూరు తర్వాత పూణె రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరానికి 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతోంది. ఆ తర్వాత ఫిలిప్పీన్స్‌లోని మనీలా (27 నిమిషాల 20 సెకన్లు) , తైవాన్‌లోని తైచుంగ్ (26 నిమిషాల 50 సెకన్లు), జపాన్‌లోని సప్పోరో (26 నిమిషాల 50 సెకన్లు), తైవాన్‌లోని (26 నిమిషాలు), జపాన్‌లోని నగోయా (24 నిమిషాల 20 సెకన్లు), ఇండొనేషియాలోని జకార్తా (23 నిమిషాల 20 సెకన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. టామ్‌టామ్ ట్రాఫిక్ సూచిక 6 ఖండాల్లోని 55 దేశాల్లో ఉన్న 387 నగరాల మీద రీసెర్చ్ చేసి నివేదిక విడుదల చేసింది. నగరాల్లో సగటు ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులతోపాటు మరికొన్ని అంశాలను ఆధారంగా చేసుకొని నివేదికను సిద్ధం చేసింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే యూకేలోని లండన్ అత్యంత నెమ్మదిగా వాహనాలు కదిలే నగరంగా నిలిచింది. ఇక్కడ సగటున 10 కిలోమీటర్ల దూరానికి 37 నిమిషాల 20 సెకన్ల సమయం పడుతుంది.

## రైతు భరోసాపై కొత్తగా దరఖాస్తులు

### 14 నుంచి అమలు

**హైదరాబాద్, జనవరి 2 ( వెలుతురు):**
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసా పథకంపై కేబినెట్ సబ్ కమిటీ గురువారం చర్చించింది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు అధికారులు హాజరై, రైతు భరోసా విధివిధానాలపై చర్చించారు. ఎల్లుండి జరిగే కేబినెట్ సమావేశంలో రైతు భరోసా అమలుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. పంట సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితి పెట్టొద్దని కమిటీ అభిప్రాయ పడినట్లు సమాచారం. రైతు భరోసా అమలు కోసం కొత్తగా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించాలని నిర్ణయించారు. సంక్రాంతి పండుగ(జనవరి 14) నుంచి రైతు భరోసా అమలు చేసే అవకాశం ఉంది. ధరణి ప్రకారం కోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు సమాచారం. సాగు చేయని భూములు తీసేస్తే కోటి 30 లక్షల ఎకరాలకు రైతు భరోసా అందే అవకాశం ఉంది.

## జడ్జిల నియామకాలను వెంటనే చేపట్టండి

### - వినోద్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 2 ( వెలుతురు):**
తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో జడ్జిల నియామకానికి చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో హైకోర్టు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపాను. 2019 డిసెంబర్ 31 నాడు తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు వచ్చింది. కేసీఆర్ హయాంలోనే మేము పార్లమెంట్‌లో ఒత్తిడి చేసిన ఫలితంగా హైకోర్టు జడ్జిల సంఖ్యను 42కు పెంచారు. తెలంగాణ హైకోర్టుకు 42 మంది జడ్జిలు ఉండాలని నిర్ణయం తీసుకున్నా.. ఎప్పుడూ 23 మందికి మించి భర్తీ చేయడం లేదు. తెలంగాణ జడ్జిల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన వారు ఎవ్వరూ లేరు. పూర్తి స్థాయిలో జడ్జిలను నియమిస్తే దళిత, గిరిజన వర్గాలకు కూడా న్యాయం జరుగుతుంది అని వినోద్ కుమార్ పేర్కొన్నారు. హైకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికి పెరిగి పోతోంది.. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటే తప్ప కేసులు తొందరగా పరిష్కారం కావు. సామాజిక న్యాయం న్యాయ వ్యవస్థలో కూడా పాటించాల్సిందే. వేరే రాష్ట్రాల నుంచి తెలంగాణ హైకోర్టులో నలుగురు జడ్జిలు ఉన్నారు. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణకు కూడా న్యాయం జరుగుతుందన్నారు వినోద్ కుమార్. శామీర్ పేటకు మెట్రో రైల్ ప్రాజెక్టు వస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల కష్టాలు పోవాలంటే నాగపూర్ తరహాలో జేబీఎస్ నుంచి శామీర్ పేట వరకు డబుల్ డెక్ ఫ్లై ఓవర్‌ను ఏర్పాటు చేయాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

**రాజన్న సిరిసిల్ల, జనవరి 2 ( వెలుతురు):**
అమ్మాయికి న్యూ ఇయర్ విషెస్ చెప్పాడమే ఆ విద్యార్థి పాలిట శాపమైంది. ఎంతో ఉత్సాహంగా తన క్లాస్‌మేట్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో ఆగ్రహించిన బాలిక కుటుంబ సభ్యులు సదరు విద్యార్థిపై దాడి చేశారు. దీంతో మనస్థాపం చెందిన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంభీరావు పేట మండలం భీముని




మల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శివకిశోర్ అనే10వ తరగతి విద్యార్థి న్యూ ఇయర్(బుధవారం) సందర్భంగా తన క్లాస్‌మేట్ అమ్మాయికి విషెస్ చెప్పాడు. కాగా, మా అమ్మాయికి విషెస్ చెప్తావా అని బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు శివకిశోర్‌పై దాడి చేశారు. మనస్థాపానికి గురైన శివ కిశోర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్య విషయం తెలుసుకొని అమ్మాయి కుటుంబ సభ్యులు, బంధువులు పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


# రెండు తేదీలపై అజిత్ కుమార్ టీం ఫోకస్..

## విదాముయార్చి ఏ డేట్‌కు రిలీజయ్యేనో..?

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ వరుస సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ ప్రాజెక్టుల్లో ఒకటి మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న విదాముయార్చి. ఏకే 62గా తెరకెక్కుతున్న ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం పొంగళ్ కానుకగా రాబోతుందంటూ వార్తలు వచ్చినా పుకార్లుగానే మిగిలిపోయాయి. వరుస సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ ప్రాజెక్టుల్లో ఒకటి మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న విదాముయార్చి. ఏకే 62గా తెరకెక్కుతున్న ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ సినిమా విడుదల తేదీపై ఏదో ఒక న్యూస్ నెట్టింట హల్ చల్ చేస్తున్నా మేకర్స్ నుంచి మాత్రం అధికారిక ప్రకటన బయటకు రావడం లేదు. ఈ చిత్రం పొంగళ్ కానుకగా రాబోతుందంటూ వార్తలు వచ్చినా పుకార్లుగానే మిగిలిపోయాయి. తాజాగా విదాముయార్చి రిలీజ్‌పై ఆసక్తికర న్యూస్ ఒకటి సోషల్ మీడియాలో రౌండప్ చేస్తోంది. మేకర్స్ ఈ చిత్రానికి రెండు విడుదల తేదీలను పరిశీలిస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. తాజా వార్తల ప్రకారం ఈ మూవీని జనవరి 31న కానీ లేదా ఫిబ్రవరి 7న కానీ విడుదల చేయాలనుకుంటున్నారని ఓ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. మరి మేకర్స్ ఈ రెండింటిలో ఏదో ఒక డేట్‌ను ఫైనల్ చేస్తారా..? లేదంటే మరో తేదీని ప్రకటిస్తారా..? అనేది తెలియాల్సి ఉంది. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ సార్జా కీలక పాత్రలో నటిస్తుండగా.. రెజీనా కసాండ్రా మరో కీ రోల్ పోషిస్తోంది. ఇప్పటికే విదాముయార్చి నుంచి షేర్ చేసిన పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో ఆరవ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. అజిత్ కుమార్ దీంతోపాటు అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్‌లో ఏకే 63 కూడా చేస్తున్నాడని తెలిసిందే. గుడ్ బ్యాడ్ అగ్లీ టైటిల్‌తో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.





## త్రిబాణధారి బార్బరిక్‌తో ప్రేక్షకుల ముందుకు సత్యరాజ్




టాలీవుడ్ డైరెక్టర్ మారుతి కాంపౌండ్ నుంచి మైథలాజికల్ కాన్సెప్ట్‌తో వస్తోన్న చిత్రం త్రిబాణధారి బార్బరిక్. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో సత్యరాజ్ లీడ్ రోల్ రోల్‌లో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ టైటిల్ గ్లింప్స్‌ను షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం నుంచి తాజాగా సత్యరాజ్ పాత్ర లుక్‌ను షేర్ చేశారు మేకర్స్. సత్యరాజ్ ఈ చిత్రంలో డ్యాక్టర్ శ్యామ్ కథు పాత్రలో నటిస్తున్నాడు. బార్బారిక్ ప్రపంచంలో సత్యరాజ్ పాత్ర కీలకంగా సాగనున్నట్టు పోస్టర్‌తో తెలియజేశాడు డైరెక్టర్. ఈ మూవీ టీజర్‌ను జనవరి 3న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. రామాయణ, మహాభారతాల పాత్రలను తీసుకుని ఇప్పటికే చాలా సినిమాలు రాగా.. తాజాగా ఇదే జోనర్‌లో భీముడు మనవడు, ఘటోత్కచుడు కుమారుడు బార్బరిక్ కథ ఆధారంగా ఈ సినిమా వస్తుంది. ఎవరు తాతా ఇతను..? అని చిన్నారి అడుగగా.. ప్రపంచం గుర్తించని గొప్ప యోధుడమ్మా.. భీష్ముడా తాతా..? హహ కాదమ్మా.. అంటూ సాగే డైలాగ్స్‌తో మాధవా.. వెయ్యేనుగుల బలశాలి భీముడికి మనవడిని. ఘటోత్కచుడుకు కుమారుడిని అంటూ బార్బరిక్ పాత్రను ఎలివేట్ చేసే ఇంట్రడక్షన్ వీడియో స్టన్నింగ్‌గా సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్‌పై విజయ్‌పాల్ రెడ్డి అడిధాలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీలో వశిష్ఠ ఎన్ సింహా, సంచి రాయ్, సత్యం రాజేశ్, క్రాంతి కిరణ్, వీటీవీ గణేశ్, మొట్ట రాజేంద్ర, ఉదయ భాను ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.


## ఆ ఘటనలో అల్లు అర్జున్‌ది తప్పు లేదు : బోనీకపూర్



పుష్ప–2 స్క్రీనింగ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనపై బాలీవుడ్ ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ తాజాగా స్పందించారు. తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ తప్పేమీ లేదన్నారు. మహిళా అభిమాని మృతికి అల్లు అర్జున్‌ని బాధ్యుడిని చేయడం సరికాదన్నారు. ఈ ఘటనలో బన్నిని నిందించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. జనాలు ఎక్కువగా రావడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని అన్నారు. 'సౌత్ ఇండియాలో హీరోలకు ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే. తమిళ్, తెలుగు స్టార్ హీరోల సినిమాలు విడుదల సమయంలో థియేటర్ల వద్ద వేలాది మంది బారులు తీరడం నేను స్వయంగా చూశాను. నేను నిర్మించిన అజిత్ సినిమాని చూసేందుకు అర్ధరాత్రి 1 గంటకు థియేటర్‌కు వెళ్లా. అప్పుడు థియేటర్ వెలుపల 20 వేల నుంచి 25 వేల మంది అభిమానులు ఉన్నారు. అంతమందిని చూసి నేను ఒక్కసారిగా షాక్ అయ్యాను. ఇక సినిమా షో ముగించుకుని 3:30 నుంచి 4 గంటల మధ్య బయటకు వచ్చా. అప్పుడు కూడా చాలా మంది థియేటర్ బయట ఉన్నారు. రజినీకాంత్, చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్, మహేష్ బాబు వంటి అగ్ర నటుల చిత్రాల విడుదల సమయంలో ఇలానే జరుగుతుంది. ఆయా స్టార్స్ సినిమాల రిలీజ్‌లకు పెద్ద ఎత్తున అభిమానులు తరలి వస్తారు. అలా జనాలు పరిమితికి మించి రావడం వల్లే సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో మహిళ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఇందులో అల్లు అర్జున్ తప్పేమీ లేదు. ఆయన్ని నిందించాల్సిన అవసరం లేదు' అని బోనీ కపూర్ చెప్పుకొచ్చారు. కాగా, పుష్ప2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొకిసలాట ఘటనలో పోలీసులు ఇటీవల అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే అదే రోజు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. నాలుగు వారాలపాటు ఈ బెయిల్‌ను మంజూరుచేసిన కోర్టు రూ.50 వేల వ్యక్తిగత బాండ్లు చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలని ఆదేశించింది. మరోవైపు నాంపల్లి కోర్టు అతడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ఈ రిమాండ్ ఇటీవలే ముగియడంతో ఆయన వర్చువల్‌గా కోర్టుకు హాజరయ్యారు. అప్పుడే అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో రేపు విచారణ జరగనుంది.

## లవ్ స్టోరీని రివీల్ చేసిన క్రీర్తిసురేష్


'మహానటి' సినిమాతో తెలుగుతోపాటు తమిళంలోనూ సూపర్ ఫేం సంపాదించుకుంది నేషనల్ అవార్డు విన్నింగ్ బ్యూటీ కీర్తి సురేశ్. తెలుగు, తమిళంలో వరుస చిత్రాలతో బిజీగా మారిపోయింది. ఇటీవలే తన చిన్ననాటి మిత్రుడు ఆంటోనీ తట్టిల్ ను కీర్తి ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. గత నెల గోవాలో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఆంటోనీతో తన ప్రేమబంధాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది కీర్తి సురేశ్. 12వ తరగతి చదువుతున్నప్పుడే తాను ఆంటోనీతో ప్రేమలో పడినట్లు చెప్పుకొచ్చింది. తన కంటే ఆంటోనీ ఏడేళ్లు పెద్ద అని.. 15 ఏళ్ల నుంచి ఇద్దరం ప్రేమించుకుంటున్నట్లు తెలిపింది. తొలిసారి 2010లో ఆంటోనీ తనకు ప్రపోజ్ చేసినట్లు చెప్పుకొచ్చింది. 2016 నుంచి ఇద్దరి బంధం మరింత బలపడిందని.. తనకు ఆంటోనీ ప్రామిస్ రింగ్‌ను బహుమతిగా ఇచ్చినట్లు తెలిపింది. పెళ్లి చేసుకునే వరకూ ఆ రింగ్‌ను తీసేయలేదని చెప్పింది. తాను నటించిన సినిమాల్లో కూడా ఆ రింగ్‌ను గమనించొచ్చని పేర్కొంది. 'మేమిద్దరం వ్యక్తిగత విషయాలను చాలా గోప్యంగా ఉంచడానికే ఇష్టపడతాం. ఎన్నో సంవత్సరాలుగా ప్రేమలో ఉన్నా.. పెళ్లి ఫిక్స్ అయ్యే వరకూ మా ప్రేమ విషయం సీక్రెట్‌గానే ఉంచాలని నిర్ణయించుకున్నాం. నేను ఆంటోనీతో ప్రేమలో ఉన్నట్లు నా స్నేహితులు, ఇండస్ట్రీలో కొంతమందికి మాత్రే తెలుసు. సమంత, విజయ్, అట్లీ, ప్రియా, ప్రియదర్శన్ వంటి వారికి మాత్రమే మా ప్రేమ గురించి తెలుసు. 2017లో మేమిద్దరం మొదటిసారి విదేశాలకు కలిసి వెళ్లాం. 2022లో పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాం. 2024 డిసెంబర్‌లో ఒక్కటయ్యాం. ఆంటోనీ నా కెరీర్‌కు చాలా సపోర్ట్ ఇస్తాడు. తను నా జీవితంలోకి రావడం నిజంగా నా అదృష్టం' అని తన ప్రేమ కథను వివరించింది ఈ మహానటి.



## పెళ్లి చేసుకున్న బుట్ట బొమ్మ సింగర్



బుట్ట బొమ్మ సాంగ్ ఫేం బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ పెళ్లి బంధంలోకి అడుగుపెట్టాడు. తన చిరకాల స్నేహితురాలు ఇన్‌ఫ్లుయోన్సర్ ఆష్నా ష్రాఫ్‌ను వివాహం చేసుకున్నాడు. అర్మాన్ మాలిక్ ఆగస్ట్ 2023లో ఆష్నా ష్రాఫ్‌కి ప్రపోజ్ చేశాడు. దీంతో ఆగష్టులోనే ఈ జంట నిశ్చితార్థం జరిగింది. అయితే తాజాగా ఈ జంట పెళ్లి చేసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కాగా వీరి పెళ్లికి సంబంధించిన ఫొటోలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు అర్మాన్. ఈ పోస్ట్‌కి 'నువ్వు నా ఇల్లు' అంటూ రాసుకోచ్చాడు. అల్లు అర్జున్ నటించిన అలా వైకుంఠపురంలో సినిమాలో బుట్ట బొమ్మ సాంగ్‌తో నేషనల్ వైడ్‌గా పాపులర్ అయ్యాడు అర్మాన్. ఇదే కాకుండా వరుణ్ తేజ్ నటించిన తొలిప్రేమ, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా తదితర సినిమాలలో పాటలు పాడాడు ఈ బాలీవుడ్ సింగర్.



## సెన్సార్ పూర్తి చేసుకున్న గేమ్ ఛేంజర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ నటిస్తున్న హై వోల్టేజ్ యాక్షన్ మూవీ గేమ్ ఛేంజర్. తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథను అందిస్తున్నాడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ మూవీ కోసం మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. అభిమానుల ఎదురుచూపులకు బ్రేక్ చేస్తూ.. జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ చిత్రం. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా 8 రోజులు కూడా లేకపోవడంతో తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది ఈ చిత్రం. పొలిటికల్ థ్రిల్లర్‌గా రానున్న ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. రన్ టైం విషయానికి వస్తే.. 165.30 నిమిషాల (2:45 గంటలు) రన్‌టైమ్‌తో ఈ సినిమా అలరించడానికి సిద్ధమైంది. మరోవైపు ఈరోజు సాయంత్రం 5 గంటలకు ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు మేకర్స్. ఈ సినిమాలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్‌లో నటించబోతున్నాడు. రామ్‌నందన్ అనే యువ ఐఏఎస్ అధికారిగా కనిపించడంతో పాటు, తండ్రి అప్పన్న పాత్రనూ ఆయనే చేశారు. కియరా అద్వాని, అంజలి, సముద్రఖని, సునీల్, శ్రీకాంత్, నాజర్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# రైతుబంధు సాయంపై మీనమేషాలు

- రైతులను తగ్గించేలా కసరత్తు సరికాదు
- కెసిఆర్ హయాంలో రైతులందరికీ న్యాయం
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి వేముల



**నిజామాబాద్,జనవరి2(వెలుతురు):**
సంక్రాంతి నుంచి రైతుభరోసా అమలు చేస్తామన్న రేవంత్ సర్కారు మీనమేషాలు లెక్కిస్తూ రైతులను దగా చేసే ప్రయత్నాల్లో ఉందని మాజీమంత్రి వేముల ప్రశాంత రెడ్డి విమర్శించారు. ఏడాదిగా రైతుబంధును ఆపేసిన కాంగ్రెస్ తీరుపై రైతుల్లో జోరుగా చర్చ జరుగుతున్నదని అన్నారు. రుణమాఫీకి రైతుబంధు డబ్బులను ఉపయోగించి, ఇప్పుడు ఏడాదైనా కాలక్షేపం కబుర్లతో కాలయాపన చేస్తోందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకంలో తీసుకురానున్న మార్పులపై సర్వత్రా ఆందోళన నెలకొన్నదన్నారు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లు అందరికీ పెట్టుబడి సాయం ఇవ్వాలని ఆమన డిమాండ్ చేశారు. రైతుబంధు పథకంలో మార్పులకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎవరికి అన్యాయం చేసినా బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదన్నారు. కుటుంబం యూనిట్‌గా అమలు చేయాలని చూస్తున్నది. అలాగే, ఎన్ని ఎకరాలు ఉన్నా ఐదు లేదా ఏడు ఎకరాలకు మాత్రమే ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. పైగా రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నదని అన్నారు. వీటన్నటిపైనా వివరణ ఇవ్వాలన్నారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి జిల్లాలోని 5 లక్షల మందికి పైగా రైతులకు పెట్టుబడి సాయం ఠంచన్‌గా అందేది. రెండు సీజన్లలో కలిపి రూ.వెయ్యి కోట్ల దాకా రైతులకు లబ్ది చేకూరేది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం ఆగిపోయింది. వానకాలంలో ఇవ్వకుండా ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు.. యాసంగికి సంబంధించి సంక్రాంతికి ఇస్తామని చెబుతున్నదని మండిపడ్డారు..పసుపు పంట సాగు చేసే వారికి ఏడాది కాలం గడిచి పోతున్నది. 9 నెలల పసుపు పంటను సాగు చేసే వారికి ఏ ప్రాతిపదికన రైతుభరోసా అందిస్తారో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ సర్కారు నాలుగు విడుతల్లో కలిపి కొంత మంది రైతులను మాత్రమే రుణ విముక్తులను చేసిందని అన్నారు. చాలామందికి ఇప్పటికీ మాఫీ జరగేలదని అన్నారు. దీనిపై కప్పదాటు వ్యయహారం సాగిస్తోందని వేముల మండిపడ్డారు. సగం మందికి మొండిచేయి చూపింది. సాంకేతిక కారణాలను చూపి చాలా మందికి రుణమాఫీ ఎగ్గొట్టారు. కుటుంబంలో ఒకరికే రుణమాఫీ అంటూ సగానికి ఎక్కువ మందిని పక్కకు జరిపింది. తాజాగా రైతుభరోసా పథకం అమలులోనూ ఇదే అస్తవ్యస్త విధానం కనిపిస్తుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. రెండు పంట సీజన్లలో కలిపి ఏడాదికి రూ.15 వేల చొప్పున సాయం అందాల్సి ఉండగా, ఇప్పటికీ చిల్లి గవ్వా అందలేదని గుర్తు చేశారు. రైతు డిక్లరేషన్ పేరిట అనేక వరాలు కురిపించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. అమలులో మాత్రం విఫలమైందన్నారు.. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పి కొంత మందికే మాఫీ చేసి చేతులు దులుపుకున్నదన్నారు. రైతుబంధు పథకం అమలు చేయకుండా రైతులను దారుణంగా మోసగించింది. రైతుబంధు కింద ఇస్తున్న రూ.5 వేలను రూ.7,500కు పెంచి రైతుభరోసా పథకం తీసుకొస్తామన్న హామీ ఏడాది దాటినా అమలు కాలేదు. రెండు సీజన్లకు సంబంధించి పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన ప్రభుత్వం.. సంక్రాంతి నుంచి ఇస్తామని ప్రకటించింది.రైతుభరోసా విధివిధానాల ఖరారుపై సర్కారు దృష్టి సారించినా అవి ఏమిటో చెప్పడం లేదన్నారు. అందరికీ పెట్టుబడి సాయం ఇస్తారా? లేక కొందరికే ఇస్తారా? అన్నది తేల్చాలన్నారు. ప్రస్తుతం యాసంగి మొదలై రెండు నెలలు గడిచినా రైతుభరోసాపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టింది. రైతుబంధు డబ్బులు ఇవ్వకపోవడాన్ని ఎత్తిచూపింది. రైతుభరోసాపై అన్నదాతల్లో అలుముకున్న అనుమానాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సాంకేతిక అంశాలతో పాటుగా శాస్త్రీయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అయితే రైతుభరోసాను అందరికీ వర్తింపజేయాలని వేముల డిమాండ్ చేశారు.

# డ్యూటీ విషయంలో ఇద్దరి పోలీసుల మధ్య గొడవ

**సూర్యాపేట, జనవరి 2 (వెలుతురు):**
పోలీస్ శాఖలో క్రమశిక్షణ కొరవడుతున్నది. వివాహేతర సంబంధాలు, అవినీతి ఆరోపణలు, ఆత్మహత్యల వంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటుండంతో శాఖ పరువుతీస్తున్నాయి. బుధవారం కుటుంబ కలహాలతో ఓ కానిస్టేబుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పీఎస్‌లో విధుల విషయంలో ఇద్దరు పోలీసులు గొడవపడ్డారు. కానిస్టేబుల్ రవి నాయక్, హెూంగార్డు శ్రీనివాసులు మధ్య డ్యూటీ విషయమై ఇటీవల తగాదా జరిగింది. విషయం బయటికి పొక్కడంతో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ చర్యలు తీసుకున్నారు. వారిద్దరిని వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక హైదరాబాద్ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ జటావత్ కిరణ్(36) కుటుంబ కలహాలతో ఓ కానిస్టేబుల్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన అతడు నిత్యం భార్య, పిల్లలను వేధిస్తున్నాడు. నూతన సంవత్సరం సందర్భంగా నాలుగు రోజులు ముందుగానే లీవ్ పెట్టాడు. బుధవారం ఉదయం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవ పెట్టుకున్నాడు. ఆ తర్వాత ఇంటి నుంచి వారిని బయటకు పంపి తలుపులు వేసుకుని ఉరేసుకున్నాడు. అదేవిధంగా ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తన భార్యతో సీఐ డానియేల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ప్రశాంత్ రెడ్డి అనే వ్యక్తి నల్లగొండ ఎస్పీ రమేశ్ చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐని డీజీపీ కార్యాలయానికి ఎటాచ్ చేశారు. జ్యోతి అనే మహిళ నల్లగొండ టాస్క్‌ఫోర్స్‌లో ఎస్సైగా పనిచేస్తున్న తన భర్త మహేందర్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని తమను పట్టించుకోవడం లేదని, తమకు కారుణ్య మరణం ప్రసాదించాలంటూ ఇద్దరు పిల్లలతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగింది. అదేవిధంగా కామారెడ్డి జిల్లా భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట కానిస్టేబుల్ శ్రుతితోపాటు కంప్యూటర్ ఆపరేటర్ గతేడాది డిసెంబర్ 26న చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారిమధ్య సాన్నిహిత్యమే బలవన్మరణానికి కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నారన్న కారణంతో గతేడాది సెప్టెంబర్‌లో జగిత్యాల జిల్లా రాయికల్ ఎస్సై అశోక్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇలాంటి ఆరోపణలతోనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఏఎస్సై కూడా సస్పెండ్ అయ్యారు. ఇలాంటి ఘటనలు వరుసగా బయటపడుతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే అవినీతి ఆరోపణలు, భూవివాదాలతో పోలీసు శాఖ సతమతం అవుతున్నది.




# బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేత

- సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై హైకోర్టు ఆగ్రహం

**అమరావతి,జనవరి2(వెలుతురు):**
రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. నిందితుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారా అని వ్యాఖ్యానించింది. ఇలాంటి వారిని క్షమించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పిటిషనర్‌కు పూర్వ నేర చరిత్ర ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అనుచిత పోస్టుల వ్యవహారంలో నమోదైన 2 కేసుల్లో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైందని చెప్పారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో బోరుగడ్డ అనిల్‌పై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకోగా.. తాజాగా గురువారం హైకోర్టు కొట్టివేసింది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో బోరుగడ్డ అనిల్ అరాచకానికి హద్దే లేకుండా పోయింది. పోలీసులు సైతం అతనివైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. గుంటూరు నగరానికి చెందిన అనిల్.. కేంద్రమంత్రిగా పని చేసిన రాందాస్ అఠావలె అనుచరుడిగా చెప్పుకొంటూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా చలామణి అయ్యాడు. జగన్‌ను అన్నా అని సంబోధిస్తూ తానూ పులివెందులకు చెందినవాడినేనంటూ వైకాపాతో అంటకాగాడు. జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్యసమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్‌లలో ఇష్టానుసారం దూషణలు చేశాడు. వైకాపా ఐదేళ్ల పాలనలో జగన్‌కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడినా వారిపై అసభ్యకర పదజాలంతో విరుచుకుపడేవాడు. జగన్‌ను వ్యతిరేకిస్తూ మాట్లాడితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ప్రతిపక్షాలకు చెందిన మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి దూషించేవాడు. అప్పట్లో జగన్ పేరు చెప్పి గుంటూరు నగరంలో దందాలు, దౌర్జన్యాలతో హల్‌చల్ చేశాడు. నాడు అధికార పార్టీ వైకాపా అండదండలు ఉండటంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయాడు. జగన్ పేరు చెబుతుండటంతో పోలీసుల అతని వైపు కన్నెత్తి చూడలేదు.



# బస్సులపై తెగిపడ్డ విద్యుత్ వైర్లు

- దివాకర్ బస్సులు దగ్ధం

**అనంతపురం,జనవరి2(వెలుతురు):**
అనంత నగరంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సులు దగ్ధమయ్యాయి. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జేసీ దివాకర్ రెడ్డికి చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు దగ్ధమయ్యాయి. బస్సులపై కేవీ 11 వైర్ తెగి నిప్పురవ్వలు పడడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు చుట్టుప్రక్కల వ్యాపించాయి. దీంతో భయాందోళనలకు గురైన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో 4 బస్సులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం గురువారం తెల్లవారుజామున జరిగింది. బస్సుల వద్ద ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



# పెరిగిన గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఓట్లు

- రెండు విడతల్లో 3,41,313 మంది నమోదు




**నిజామాబాద్,జనవరి2(వెలుతురు):**
ఈ ఏడాది మార్చిలో నిర్వహించనున్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 2019 ఎన్నికల్లో 1.96 లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకోగా.. ఈ సారి రెండు విడతల్లో 3,41,313 మంది ఎన్ రోల్ చేసుకున్నారు. వీరిలో 2,18,060 మంది మేల్ గ్రాడ్యుయేట్స్ ఉండగా, ఫిమేల్ గ్రాడ్యుయేట్లు 1,23,250 మంది, థర్డ్ జెండర్ గ్రాడ్యుయేట్లు ముగ్గురు ఉన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో కలిపి టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 25,921 మంది నమోదు చేసుకున్నారు. వీరిలో పురుషులు 16,364 మంది, స్త్రీలు 9,557 మంది ఉన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో ఓటరు నమోదుకు సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు అవకాశం కల్పించారు. డిసెంబర్ లో మరో చాన్స్ ఇచ్చారు. కొత్తగా ఏర్పడిన 15 జిల్లాల పరిధిలోని 271 మండలాల్లో ఎన్ రోల్ మెంట్ జరిగింది. ఎమ్మెల్సీ క్యాండిడేట్లుగా పోటీ చేయాలనుకుంటున్న వారు 'మిస్డ్ కాల్' క్యాంపెయిన్ నిర్వహించారు. ప్రత్యేకంగా టీమ్?లు ఏర్పాటు చేసి.. గ్రాడ్యుయేట్ల నుంచి డిగ్రీ మెమో, ప్రొవిజనల్స్, ఓటరు ఐడీ సేకరించి ఆన్ లైన్ లో అప్లై చేయించారు. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 1,62,464 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 46,409 ఓటర్లు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 67,738 మంది, ఉమ్మడి మెదక్ జిల్లాలో 64,702 మంది నమోదయ్యారు. కొత్త జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా 69,657 మంది ఓటర్లతో కొత్త కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉంది. 2,420 మందితో జయశంకర్ భూపాలపల్లి జిల్లా(కాటారం, మల్హార్ రావు, మహాదేవ్‌పూర్, పలిమెల, ముత్తారం మండలాలు) చివరి స్థానంలో ఉంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 25,921 మంది టీచర్లు అప్లై చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 4,020 మంది ఉండగా, నిజామాబాద్ జిల్లాలో 3,529 మంది, సిద్ధిపేట జిల్లాలో 3,052 మంది నమోదు చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అతి తక్కువగా 81 మంది నమోదు చేసుకున్నారు.

# తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో జల్లికట్టు

- సంక్రాంతికి ముందే మొదలైన సందడి



**చిత్తూరు,జనవరి2(వెలుతురు):**
తమిళనాడు సంస్కృతి పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ కు పాకుతుంది. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు ముందు తమిళరాడెలో జల్లికట్టు పోటీలు నిర్వహిస్తారు. అయితే ప్రతి ఏడాది ఈ పోటీల చుట్టూ వివాదం జరుగుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జల్లికట్టు సంబరాలు ప్రారంభం అయ్యాయి. ఈ సంబరాలు నెల రోజుల పాటు రోజుకో గ్రామంలో జరగనున్నాయి. ఈ సంబరాలకు నిర్వాహకులతో పాటు స్థానిక అధికారులు, పోలీసులు, ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు . తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కొత్తశానంబట్లలో పశువుల పండుగ(జల్లికట్టు) నిర్వహించారు. పరిసరాల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పశువులను తీసుకొచ్చారు. వీటికి కొమ్ములు చెలిగి, రంగులు వేసి కొప్పులను తొడిగారు. నాయకులు, సినీనటులు, దేవుళ్ల ఫొటోలతో అలంకరించారు. రంగు కాగితాలు అంటించిన చెక్క పలకలతో పాటు, నగదు, దుస్తుల, విలువైన వస్తు సామగ్రిని కట్టారు. గ్రామ నడివీధిలో పశువులను గుంపులుగా వదిలారు. వేలాది మంది యువకులు అ÷–లలె అవతల నిలబడ్డారు. కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీపడ్డారు. చెక్కపలకలను చేజిక్కించుకోవడంలో యువకుల మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. కొందరు కింద పడటంతో పదిమందికిపైగా తీవ్రగాయాలు కాగా.. . మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. చెక్క పలకలను చేజిక్కించుకున్న యువకులు ఉత్సహంగా కేరింతలు కొట్టారు. పశువుల పండగను తిలకించడానికి వచ్చిన వారందరికీ గ్రామస్తులు భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు.

# నేడు ఇందిరాపార్కు వద్ద మహా సభ

**హైదరాబాద్, జనవరి 2 (వెలుతురు):**
కామారెడ్డి డిక్లరేషన్ అమలుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్న డిమాండ్‌తో సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరిం చుకొని ఈ నెల 3వ తేదీన ఇందిరా పార్కు వద్ద బీసీ మహాసభ పేరిట తెలంగాణ జాగృతి సంస్థ భారీ సభను తలపెట్టనుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. ఎన్నికల సమయంలో బీసీలకు హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక వారికి కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని కవిత ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇప్పుడు అటకెక్కాయని విమర్శించారు. సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తు చేయడానికి రేపు ఉదయం 11 గంటలకు ఇందిరా పార్కు వద్ద బీసీ మహాసభ నిర్వహిస్తున్నట్లు కవిత తెలిపారు. బీసీ మహాసభ పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత ఆవిష్కరించారు.

# చెట్టును ఢీకొట్టిన ఆటో.. 15 మంది కూలీలకు గాయాలు

**మెదక్, జనవరి 2 (వెలుతురు):**
కారును తప్పించబోయి ఓ ఆటో చెట్టును ఢీ కొట్టడంతో పలువురు కూలీలు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కల వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ఆటో చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 15 మంది కూలీలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను నర్సాపూర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భారతీయ జనతా పార్టీకి భారీ షాక్

- బీఆర్ఎస్‌లోకి చేరిన పీవీ మహేశ్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి 2 (వెలుతురు):**



నిర్మల్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి భారీ షాక్ తగిలింది. బీజేపీ సీనియర్ నాయకులు పీవీ మహేశ్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో మహేశ్ రెడ్డి గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా మహేశ్ రెడ్డికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నిర్మల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మహేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com